
# ఐక్య ఉపాధ్యాయ

UTF

సంపుటి 3 ★ సంచిక 2 ఫిబ్రవరి 1977




## మన రాజ్యం

కొత్త ప్రమోషన్ రూల్సూ
సరికొత్త మోడల్ పేపర్సూ
మోడరేషన్ రద్దూ
నిర్బంధ డిపాజిట్ పద్దూ
విద్యా విధానంలో
వింత వింత ప్రయోగాలు !
ప్రమాణాలు పడిపోవుటకు
ఫలితాలు తగ్గుటకు
పంతుళ్ళు బాధ్యులనే
పాలసీలు సృష్టించిరి !
నిర్బంధ రిటైర్ మెంటూ
నేటివిటీ ఉత్తర్వుల
ఉరిత్రాళ్ళు గొంతుకు బిగించిరి
పని గంటలు పని దినాలు
పదిలంగా పెంచగానే
విజ్ఞానం పెరిగి పెరిగి
వినువీధికి చేరునంట !
రోగమొకటి ! మందొకటి
రూల్సేమో రోజుకొకటి !
అధ్యాపక వర్గంలో
ఆందోళన పెరుగుతోంది
అందుకనే మన ధ్యేయం
ఐక్యోద్యమ నిర్మాణం !
ఆశయసిద్ధికి మూలం !!

-శ్రీ డి. సుబ్బారావు, వలపర్ల.

రు. 1

ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధికార పత్రిక
*The Largest Circulated Telugu Educational Monthly*

# పాఠకుల అభిప్రాయాలు

మా లైబ్రరీకివచ్చే 'ఐక్యఉపాధ్యాయ' చదువుతున్నాను అనుభవజ్ఞులైన డా. రామారావుగారి వ్యాసం ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఒక్క నెల 'మనమూ - మన ఆరోగ్యం' శీర్షిక గాయబ్ చేసినందుకు నిరాశ చెందుతున్నాను ప్రతి నెలా వచ్చేట్టు చూడండి. డాక్టర్‌గారికి, మీకు అభినందనలు.

— డా. ఎ. సాంబమూర్తి, పిఠాపురం.

జన్మదిన సంచిక ముఖచిత్రం పీడితోపాధ్యాయుల రక్షించే జె. సి. టి. ఎ 'గోవర్ధనోద్ధరణ' నిజంగా మా ఆశలకు ప్రతిబింబంగా ఉంది. క్వాలిటీతోపాటు, క్వాంటిటీ కూడా పెంచండి

— ఉపాధ్యాయ బృందం, లంకపల్లి అగ్రహారం.

ముఖచిత్రం 'గోవర్ధనోద్ధరణ' భావస్ఫోరకంగా ఉంది. చిత్రకారునికి అభినందనలు! పత్రిక ఆలస్యం కానీయకండి.

— వై వెంకట్రావు.

ఐక్య ఉద్యమ ప్రచారంలో మన పత్రిక కార్యకర్తల కంటె ఎక్కువగా కృషిచేస్తున్నది. మనపత్రిక ఉత్తేజకరంగా... ఆకర్షణీయంగా... విజ్ఞానదాయకంగా ఉన్నదనటానికి సోదర సంఘ సభ్యులు కార్యకర్తలు 'ఎప్పుడొస్తుందా' అని ఎదురు చూస్తూండటమే ప్రబల నిదర్శనం. 'గోవర్ధనోద్ధరణ' నాకు నచ్చలేదు. భావం సరియైనదైనా వ్యక్తీకరణలో 'ధ్వాంతం' ఉంది.

— కె. శ్రీనివాసులు, తిరుమలాయపాలెం.

'గుసగుసల' శీర్షిక నిరంకుశ అవినీతి ఉద్యోగులనెండగడుతూ దాగుడు మూతల ఆటకట్టిస్తున్నది.

— పి. యేసుదాసు, పొన్నూరు.

'గోవర్ధనోద్ధరణ జె సి టి ఎ. బలపడాల్సిన అవసరాన్ని ...కు కట్టించింది.

— వి. వెంకటేశ్వర్లు, బెల్లంకొండ.

గోవర్ధనోద్ధరణ ఎంతో ఆకర్షణీయంగా ఉంది. శ్రీ కోటేశ్వరరావుగారి 'చాలు' గేయం పత్రికలో మణిపూస.

— సి. పాండురంగారావు, ఆలూరు.

జనవరి సంచికలో వార్తా ప్రపంచం అన్ని వర్గాలవారిని చైతన్యపరిచేదిగా ఉంది. ఏజన్సీ ఏరియాలలో మారుమూల గ్రామాలలో కూడా టీచర్లు మన పత్రికయెడ ఎంతో ఆసక్తి కనపరుస్తున్నారు. సంపాదక వర్గానికి నా అభినందనలు.

— కె. చిన్నారావు, నెల్లిపాక.

'గోవర్ధనోద్ధరణ' చాలా బాగున్నది. కాని సమస్యలలో అన్‌క్వాలిఫైడ్ టీచర్ల కంటిన్యూయేషన్‌కూడా చేర్చితే ఇంకా రక్తికట్టేది.

— కె. శేషయ్య, చేగొమ్మ.

విద్యావిషయక నియమ నిబంధనల ప్రభుత్వ ఉత్తర్వుల ...లో నా జ్ఞానాభిలాషిగా నేను మీ పత్రిక చందాదారుణ్ణయ్యాను. ఆ విషయాల్లో జిజ్ఞాసగల ప్రతివారు చదివితీరవలసిన పత్రిక ఐక్యఉపాధ్యాయ.

— బి మార్కండయ్య, నెమ్మిగల్.

1976 అక్టోబరులో నిర్వహింపబడిన ప్రధానోపాధ్యాయుల ఎక్కౌంట్ టెస్ట్ ఫలితాలు

పూర్తిగా ఉత్తీర్ణులైనవారు

ఒకేధాన్యులో: 4. 10, 15, 16, 23 25 29, 30, 37 39, 40, 43 48 51, 63 80 83 86, 89, 90 99 105, 110, 116 141 145 148 150, 168 223 228, 253, 261, 266, 274 275 296 303 306 309 312 317. 362, 449 481, 538 569 601, 605, 610 612, 669. 670 675 703, 714 753 770 843 844 852, 880, 907 908 913, 915, 954, 969, 971, 1008, 1019, 1021, 1102

వివిధధాన్యులతో: 27 28 32, 51, 121, 137, 160 202 222 233 241 243 245, 246 248 249, 257, 285 295 299 316 324 344 358 365 373 381 384 428 438 468 480 537 553 556 560 579 609 611 615 616 621 622 646 656 668 676 677 690 704 710 721 722 727 767 779 781 791 817 830 842 846 850 853 877 882 885 892 911 914 943 974 976 1017 1022 1032 1051 1060 1149

మే77లో జరుగు ఎక్కౌంట్ టెస్ట్ పరీక్ష ఫీజులు చెల్లించు చివరి తేదీ: 7-3-77

1రు. పెనాల్టీతో పరీక్షఫీజు చెల్లించు చివరితేదీ:17-3-77

ఆఫీసుకుదరఖాస్తులు చేరవలసిన చివరి తేదీ :23-3-77

నేను గత సంవత్సరం మామూలు చందాదారుడను. సంపాదకవర్గం ప్రచురించే వ్యాసములు కన్నెంతో ఆకర్షించేయి. యు టి యఫ్, పత్రిక దినదినాభివృద్ధిగాంచాలని కోరుకుంటూ జీవితచందాదారునిగా చేరుచున్నాను.

— పి. వెంకటరెడ్డి, కడిగూడెం.

పాఠ్య గ్రంథాల తిరుతెమ్మలు శీర్షిక పుస్తకాలలోని అవకతవకల్ని తెల్పుచున్నందుకు రచయితకు నా అభినందనలు! పాఠకుల అభిప్రాయాల శీర్షికకు ఎక్కువ స్థలం కేటాయించండి.

— కె. దేవదానం, మున్నంవారిగూడెం

అభినవ నీతిచంద్రిక సమాజాన్ని అద్దంపట్టిన రసగుళిక. కర్తవ్య బోధనకు మచ్చుతునక.

— షేక్ మస్తాన్. పరుచూరు.

పత్రిక సర్వప్రియమై, యథార్థదర్పణమై వెలుగొందుతున్నది.

— జి. వి. మార్రాజు, మోగల్లు

అచిరకాలంలోనే అందరి మన్ననలు పొందిన పత్రికామ్మతల్లికి నా నూతన సంవత్సర శుభాకాంక్షలు.

— యమ్. యస్. రంగాచార్యులు, పొన్నమండ.

నవంబరు నెల సంచికలో 50% డి ఎ వివరాలు ప్రచురించినందుకు అభినందిస్తున్నా. కాని రూ 216 పేగలవారికి సి. డి 41 గా, రు 243 గా, రూ 260 కు రు 49 గ, రు 280కు రు 53 గ సవరింపగోరెదను.

— పి. వెంకటేశ్వరరావు, పొనుగుపాడు.

IUVDIA122

IKYA UPADHYAYA

Life Subscription 116-00
Yearly ,, 10-00
Single Copy 1-00

Ikya Upadhyaya
Akulavari Street,
Vijayawada-2

# ఐక్య ఉపాధ్యాయ

సంపాదక వర్గం :
మైనేని వెంకటరత్నం
(ప్రధాన సంపాదకుడు)
నాదెళ్ళ సీతారామాచారి
కోడూరు నారాయణరావు
అప్పారి వెంకటస్వామి
మోతుకూరు నరహరి

సంపుటి 3 ఫిబ్రవరి 1977 సంచిక 2

## ఐక్య ఉద్యమం

ఐక్యత... విశాల సమైక్యత నేడెంతయినా అవసరం.

రెడ్ టేపిజానికి, లంచగొండి తనానికి, బ్యురాక్రసీకి నిలయమైన ప్రస్తుత పరిపాలనా వ్యవస్థలో సమస్యా పరిష్కారానికి సంఘటితమార్గంతప్ప మరోమార్గంలేదనేదిదశాబ్దాలఉపాధ్యాయ ఉద్యమం రుజువుచేస్తున్న గుణపాఠమూ... చిర సత్యమూను.

అనేకానేక క్లిష్ట సమస్యలతో వేగిపోతూ, ఉన్న సదుపాయాలు కోల్పోయి, లేని భారాలు మీదపడి, బ్రతుకు సుడిగుండంలో వెతలపాలవుతున్న పీడితోపాధ్యాయులంతా కోరుకొంటున్నది అట్టి సంఘటిత శక్తినే... అట్టి విశాల సమైక్యతనే.

దాని రూపమే యు. టి. యఫ్. ఆవిర్భవించిన దాదిగా పాటుపడుతున్నదీ... పోరాడుతున్నదీను.

రాష్ట్రంలోని 11 ఉపాధ్యాయ సంఘాలతో, 8 మంది ఉపాధ్యాయ యమ్. యల్. సి. లతో జె.సి.టి.ఎ. ప్రాదుర్భవించిందీ ఆ భావంతోనే, పాక్షిక విజయం సాధించి సంపూర్ణ విజయానికి పోరాడుతున్నదికూడా ఆ బాటలోనే యావత్తు ఉపాధ్యాయలోకం హర్షం తెలిపిందీ అందుకే.

ఈ సందర్భంలో 9 ఉపాధ్యాయ సంఘాలతో కాన్ ఫెడరేషన్ ఏర్పడిందనేవార్త ఒకటివచ్చింది. ఏనాడో 1972లో సంప్రదింపులుజరిగి,నిబంధనావళి రూపొందించేదశలో ఆగిపోయి ఈనాటి వరకు మూలబడి వున్న కాన్ ఫెడరేషన్ ప్రస్తుతం ప్రకటన రూపంలో తిరిగి వెలుగు చూసింది. జె. సి. టి. ఎ. నిస్సందేహంగా దాని నిర్మాణాన్ని తొందర పరిచి వుండాలి.

కాన్ ఫెడరేషన్ ఆనాటి ఆలోచనల ప్రకారం ఎవరిసంఘ అస్తిత్వాన్ని వారు కాపాడు కొంటూనే, సభ్యత్వాలు సంఘ నిర్మాణం ఎవరికి వారు సాగించుకొంటూనే, సమస్యలపై కలిసి పనిచేసే సమైక్యసంస్థ.

కాని కాన్ ఫెడరేషన్ ఏర్పాటు చాలనుకున్న రోజుకూ యీ రోజుకూ మధ్య చాలా చరిత్ర గడిచింది. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఒకటిఏర్పడి ఉపాధ్యాయ లోకంలో గణనీయమైన స్థానాన్నిసంపాదించుకొన్నది.అన్ని ఉపాధ్యాయ సంఘాలూ, శాసనమండలి ఉపాధ్యాయ సభ్యులందరూ జె. సి. టి. ఎ గా ఏర్పడి కొన్ని విజయాలను సాధించి, మరికొన్ని విజయాలు సాధించనున్న తరుణమిది. ఈనాడు వచ్చిన అపూర్వ అవకాశాలు వినియోగించుకొని జె. సి. టి. ఎ యింకాబాగా

## సంపాదకీయం

కృషిజేస్తే అనేక విజయాలు సాధించ వచ్చునని ఆశలు ఉపాధ్యాయ లోకంలో జనించిన కీలక సమయంలో మనం ఉన్నాము.

వెనకటి అభిప్రాయాన్ని పునరుద్ధరించి దానికొక రూపం ఇవ్వదలచుకొన్న కాన్ ఫెడరేషన్ స్థాపకులు యీ పరిస్థితిని కూడా తమ దృష్టిలో పెట్టుకొని ఉండవలసింది. జె.సి టి.ఎ.లో ఉన్న 11 ఉపాధ్యాయ సంస్థలనూ అందుకు సంప్రదించి, ఆహ్వానించి ఉంటే దానికొక విశాల ప్రాతిపదిక ఏర్పడి యుండేది. ఆ పని చేయకపోగా జె సి.టి.ఎ.కు గల పరిమితులను గురించి యీ సందర్భంగా నొక్కిచెప్పటం మరీ అనుచితం. దానివలన ఫిబ్రవరి 1 నుండి 14 వరకు జె సి.టి.ఎ యిచ్చిన కార్యక్రమం సఫలతలో పడటానికి సాధారణ ఉపాధ్యాయుల్లో అనేక సంశయాలూ గందరగోళం ఏర్పడడానికి పోరాట తీవ్రత తగ్గటానికి దోవ తీస్తుంది.

విశాల ఐక్యత ప్రాతిపదికగా కాన్ ఫెడరేషన్‌ను ఏర్పరచినట్లు చెప్పుకొనే దాని నాయకులు యు.టి.యఫ్‌ని అందులోకి ఆహ్వానించలేని సంకుచిత తత్వాన్ని ఎందుకు అనుసరించారో అనూహ్యం. బహుశా సంకుచిత సరిహద్దుల్ని, కృత్రిమంగా తెలుగుజాతి మధ్య నిర్మింపబడిన అడ్డుగోడల్ని ఛేదించుకొని యు.టి.యఫ్ ఆంధ్రప్రదేశ్ అంతటికీ విస్తరించటమే వీరిదృష్టిలో నేరమై ఉండవచ్చు. లేదా ఇటీవలనే అవతరించి నూతనోత్సాహంతో ఉపాధ్యాయ యువశక్తినీ, విశాల ఐక్యతా భావాన్ని సంతరించుకొని అభివృద్ధి చెందుతున్న యు.టి.యఫ్.ని వీరు హర్షింప లేకపోయి ఉండవచ్చు.

ఒకే రాష్ట్రంలో ఇన్ని దొంతరలు లేకుండా, ఒకే సంస్థగా ఏర్పడే అవకాశాలకు కాన్ ఫెడరేషన్ నిర్వాహకులు ప్రయత్నించినా ఉపాధ్యాయలోకం హర్షించేది. ఎవరి సంస్థపైన, ఎవరి ఎల్లలపైనా వారి గుత్తాధిపత్యం చెక్కు చెదరకుండా నిలబెట్టుకొనే ప్రయత్నంలో భాగంగా ఈ ప్రయత్నమన్న సందేహం కలగటమూ కద్దు.

ఏది ఏమైనా ఉపాధ్యాయ వుద్యమాభివృద్ధికి, ఉపాధ్యాయుల కోర్కెల కొరకు పాటుపడే ఏ సంస్థతోనైనా మేము సహకరిస్తాము. అందుకొరకు నెలకొన్న ఎంత విశాల ఐక్యతనైనా మేము హర్షిస్తాము. ఐక్య ఉపాధ్యాయ ఆధ్యేయాన్ని విడవకుండా ఎల్లప్పుడూ ఉపాధ్యాయ వుద్యమాన్ని కంటికి రెప్పవలె కని పెట్టుకునే ఉంటుంది.

# కవితలు గేయాలు

## జీవన సమస్య

శ్రీ యస్. ఆర్. దమ్మాలపాటి

'రాజేశా! వుంటే నిప్పు ?'
ఇంట్లో లేదండి పప్పు
దొరక లేదండి అప్పు
బియ్యం లేవండి కనీసం ఓ కప్పు
నిండు కుందండి ఉప్పు –
అని శ్రీమతి దండకం ఒప్ప జెప్పు
మన జీవితమే ఓ అరిగిన చెప్పు
ఎంత చేసినా ఉండదు మెప్పు
అడిగితే ముప్పు !
అడగక పోతే తప్పు !!

## పంతులయ్య

—వై. రుక్మాంగదరెడ్డి, వెల్దండ

పొదులోనికి క్రుంగిన-రాతు వెలికి
త్రొక్కినముగాని- గొంతులో చిక్కుకొనును
వెలగ కాయేమొ యని మీరు తలవవద్దు
అయ్యవారల జీతభత్యాల పద్దు !

*　　*　　*

ఇల్లు గట్టుదమన్నను, పిల్ల పెండ్లి
చేతమన్నను నాకేమి చేతగాదు
ముద్దను – ఉప్పుకారములోన నద్దుకొని
తినుటకు గూడ నిబ్బందియగుటగలదు – ఇక
ఇళ్ళు-పెళ్ళిళ్ళు-అనెడి గొబ్బుగుళ్ళు ఏల?

*　　*　　*

మాయమర్మము దెలియని- మంచి చెడ్డ
లన్న నేమొ యెరుంగని- చిన్నవారి
ఉజ్వలంబుగ వెలుగ జేయుద మటన్న
కాంక్ష గలదు బలీయంబుగా మదీయ
హృదయమందున- కాని, సహింప రాని
వెన్నో అవరోధములు వెనుదన్ను చుండె

*　　*　　*

నాకు వెలుగు కావలె – నా మనంబె నాకు
స్వర్గ తుల్యంబు కావలె – వాయువేగమున
పరుగులెత్తవలె నేను-వినుడు మీరు
కుంటి బ్రతుకెన్నడును నేను కోరుకొనను

# కారు చౌక

'స్వామి'

బియ్యం కిలో రు. 2-50, ఉల్లిపాయలు రు. 1-50, పంచదార రు. 5-00, కందిపప్పు రు 3-80 మంచినూనె 10-00, కొబ్బరినూనె రు. 18-00 ఇలా అంగట్లో అన్నిఅడిగి, చుక్కలంటే ధరలకు హడలిపోయి, వచ్చిన జీతం ఎలాసరిపెట్టాలో తెలీక వడిలిపోయి, ఆ విసుగంతా నులక మంచంమీద చూపేడు ...దభీమని వాల్చుకొంటూ బడిపంతులు నరసింహమూర్తి

ఏబట్ట అడిగినా మీటరు ఐదు, పది, అంతకు ఎక్కువే తప్ప ఒక్కదాని ధరా అందుబాటులో లేక, గాలివాన పంటను తుడిచిపెట్టగా చేతికి దక్కిన దానికైనా కొనేనాథుడులేక, ఏంచేయాలో దిక్కుదోచక, చిరుగు చొక్కామీద మరో కుట్టు కుట్టుమని కూతురు చేతికిచ్చాడు పేదరైతు వెంకయ్య.

ఇడ్లీ 40పై, స్వీటు రు1-00, టీ 50పై, భోజనం రు3-00 బోర్డువంక కసిగాచూసి, రాజ్యాంగంలో ఏమి మార్చినా పని కల్పించే హక్కు లేదు. నిరుద్యోగభృతి లేదు' అంటూ బల్లమీది నీళ్ళు గటాగటా తాగి హోటల్ నుండి బయటపడ్డాడు నిరుద్యోగి మనోహరరావు.

'బాబూ ధర్మం' అని అడిగితే 'అడుక్కోవటం నిషేధించారు తెలుసా?... జైలుకు పంపిస్తారు... జరిమానా వేస్తారు' అన్న పెద్దమనిషితో 'జైలులో అయితే హాయిగా ఉంటాం గాని... జుల్మానా కూడా అడుక్కునే కట్టాలాబాబూ! అని ఆశ్చర్యం వెళ్ళబుచ్చాడు తరతరాల బిచ్చగాడు ధర్మయ్య.

అప్పటి వరకు రాళ్ళుబద్దలుగొట్టి, రోడ్డు వారచెట్టు క్రింద ముంతలో చద్దన్నంతింటూ 'ఉల్లిపాయి నంజుడయినా లేకపోతే ... ఎలా తినేదీ యీ గంజన్నం ? అని భార్యపై విసుక్కొనగా 'ఆ ఉల్లిపాయకొంటే యీ గంజి అన్నంకూడా దొరకదు' అని అంటించింది చుక్కమ్మ రుసరుసలాడుతూ.

రోజంతా రిక్షా తొక్కినా ఇల్లు గడవక హాస్పిటల్ ముందు 'రక్తం కావాలంటూ' అడిగిన ఒకరికి బక్కచిక్కిన తన దేహాన్ని నిమురుకొని జబ్బుపడిన పిల్లదాన్ని తల్చుకొని ఏదయితే అదవుతుందని గేట్లోకి అడుగు పెట్టేడు రిక్షారత్తయ్య

*　　*　　*

అన్నింటికి ధరలు మండుతున్నాయి. ఏ వస్తువూ అందుబాటులో లేదు. చేద్దామన్నా పనిలేదు. ఉన్నా వచ్చేది యే మూలకూ చాలదు.

అన్నింటి కంటే చౌక ... కాదు కాదు కారు చౌక
మనిషి! మనిషి!! మనిషి !!!

---


## ఐక్య ఉపాధ్యాయ ప్రకటన రేట్లు

| | |
|---|---|
| 4వ కవరు పేజి | రు. 300-00 |
| 2, 3 కవరు పేజీలు (ఒక్కొక్కటి) | రు. 250-00 |
| లోపలి పూర్తి పేజీ | రు. 200-00 |
| లోపలి (అర) ½ పేజీ | రు. 100-00 |
| లోపలి (పావు) ¼ పేజీ | రు. 50-00 |

# గాలివాటమే మా విధానం!

# వెన్నుపోటే మా ఆశయం!

## ఆం॥ ప్ర॥ షేషన్ కౌన్సిల్ బాగోతం

—'డబులెమ్మె'

ఊసరవెల్లి జెండా రెపరెపల మధ్య ...

'ఏ గాలికి ఆ తెరచాప ఎత్తాలి! ఏరోటి దగ్గర ఆ పాట పాడాలి! అందితే జుట్టు....అందకపోతే కాళ్ళు! పైరవీ కార్యక్రమం జిందాబాద్! జిత్తులమారి ఎత్తులు జిందాబాద్!' అనే నినాదాల మధ్య ...

గాంధేయ వర్తకసంఘం వారి బ్రాందీ భవనంలో ...

శ్రీ శ్రీ దళారి ధర్మరాజుగారి అధ్యక్షతన ...

ఆంధ్రప్రదేశ్ షేషన్ కౌన్సిల్ సమావేశం అత్యంత వైభవోపేతంగా జరిగింది.

శ్రీ కప్పల అప్పలాచారిగారి రాసభ గానంతో సభ ప్రారంభమయింది.

తొలుదొల్త అధ్యక్షులవారు 'జనాభా పెరుగుదలను తీవ్రంగా అరికట్టిన తుపానుగాలుల్ని, వరద ప్రమాదాల్ని అభినందిస్తూ లక్షలాది ప్రజల మరణానికి, కొంపాగోడూ కోల్పోవటానికి కారణం వాళ్ళ పాపంపండటమేనని ఉద్ఘాటించగా సభ్యులు హర్షామోదాలు వెళ్ళబుచ్చుతూ ఆదేపనిగా చప్పట్లు చరిచారు.

ఆ ధ్వనికి చవుడు బారిన గోడల పెళ్ళలు రాలిపడగా... గుడ్లగూబలు ఉరకుక్కలూ గొంతులు కలిపి అరిచాయి.

శ్రీ దళారివారు అధ్యక్షోపన్యాసం ఇస్తూ ఇలాఅన్నారు.

'నా ప్రియ సోదరులారా! స్వాగతం! సుస్వాగతం!

పైరవీ కార్యక్రమంలోను, వెన్నుపోటు పొడవటంలోను, తిమ్మిని, బమ్మి చేయటంలోనూ ఆరితేరిన మీ అందరికీ నా శుభస్వాగతం!

మనం గొప్ప అదృష్ట జాతకులం. మన కాకాలు ... బాకాలు గత సంవత్సరం నిర్విఘ్నంగా సాగిపోయినయ్. గత డి ఏ మెర్జ్‌డ్ స్కేళ్ళు ... బదోపంతు సి.డి. మొదలైన అనేకానేక సమస్యలపై మన వసూళ్ళ కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగింది. ఎవళ్ళ భాగం వాళ్ళకు ముట్టింది. ఫలితంగా అనేకమంది అధికారులు స్కూటర్లు, మోటార్ సైకిల్‌లు కొనుక్కోవటమేగాక ఇళ్ళు గట్టుకొని గృహప్రవేశాలు కూడా చేశారు. ఆ సందర్భంలో జరిగిన సత్యనారాయణ వ్రతాలలో పాల్గొని ఖర్చుకు సరిపడా చదివింపుల కార్యక్రమం దిగ్విజయంచేశాము. పనిగంటలు, పనిదినాలు పెంచి అధికారులు మన తిక్క కుదిర్చేరు. మొదట పనిభారానికి ప్రతిఫలం ఇవ్వాలని న్యాయమైన కోర్కె కోరేము. గాలి మారేప్పటికి లాభం లేదని మందలో కలిశాము. మన శత్రువులు దాన్ని వినియోగించుకొని ముందుకు పోతున్నారు. దాన్ని అరికట్టటానికి మరో కొత్త ఎత్తు ఎత్తేము. అది పారిందా ... మనం తంతే గారెల బుట్టలో పడ్డట్టు అవుతాము. మనల్ని ద్రోహులని కొందరు శంకిస్తున్నారు.

ఈ శంకలూ....కుశంకలూ జాన్‌తానై. పబ్బం గడపటమే మన లక్ష్యం. శత్రువుల ఆట కట్టింపే మన ధ్యేయం. బయట మనం అందరికంటే ఎక్కువగా గంభీరోపన్యాసాలు చెయ్యాలి. లేకపోతే అన్ పాపులర్ అవుతాం. గాలి వాలునబట్టి నడవాలి. అంతగా నెత్తిమీదికి వస్తే తప్పుకోవాలి. ఇంకా మనకేం భయం? ముఖాన ఉమ్మేస్తారంటారా ... తుడుచుకుంటే సరి ... అదే పోతుంది! ఛీ ... ఛీ అంటారా వాళ్ళ గొంతులే నొప్పెడతాయి. మనకంటే దారిదోపిడిగాళ్ళు ... జేబులు గొట్టేవాళ్ళు దేశంలో చాలామంది ఉన్నారు. అసలు అధికారం వాళ్ళదే. ఆ వారసత్వం మనకున్నంతవరకు మన పంటిమీద యీగవాలదు. ఇదివరకు అదే జరిగింది ... ఇక ముందు అదే జరుగుతుంది! జై పైరవీ!' అంటూ తన ప్రసంగాన్ని ముగించి 'ఇప్పుడు ముఖ్యంగా మన అతిథిగా వచ్చిన జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీ మంగలి మహేశ్వరరావుగారు తమ దివ్య సందేశాన్ని అందిస్తారంటూ కూర్చున్నారు.

### శ్రీ మంగలి వారి ప్రసంగం

ఉపాధ్యాయులారా! నాకు మీ వందనాలు!

నాకు విద్యాభివృద్ధి అన్నా ... ఉపాధ్యాయ శ్రేయస్సు అన్నా ఎంత అభిమానమో నేనే చెప్పలేను. నేను చిన్నప్పుడు ఒక్క రోజు బళ్ళోకి వెళ్ళిన పాపాన పోలేను. మా మేష్టారు వీపు మీద చింతబరికతో వడ్డించేసరికి బడిమానేశాను. తర్వాత నాయకుణ్ణయి మంత్రి నయ్యాను. అది ఊడి ప్రస్తుతం మీ అందరి చైర్మన్‌ని అయ్యాను. అయితే ముఖ్యంగా ఇవాళ మన దేశంనిరుద్యోగంతో నిండిందనేది నిర్వివాదాంశం. అన్నిరంగాలు అటుంచి విద్యారంగం చూస్తే 5 లక్షల నిరుద్యోగులున్నారు. వాళ్ళందరికి ఉద్యోగాలెట్లామరి. రాత్రి చేపకూరతిని చుట్ట ముట్టించే సరికి అమాంతం ఐడియా దొరికింది. ఉపాధ్యాయులుగా మీరు 30 సం॥ లు సర్వీసు చేస్తుంటే మరి కొత్తవారు సర్వీసులోకి వచ్చేదెప్పుడు? అక్కడికి మన వాళ్లు 60 సంవత్సరాలనుండి 55కి తగ్గించారు. నిర్బంధ రిటైర్ మెంటు పేరుతో దాన్ని 50కి కుదించారు. అయినా నిరుద్యోగులు పుట్టకొక్కుల్లా పుట్టుకొస్తున్నారు. కాబట్టి సోదరులారా! మీరంతా 10 సం॥ల సర్వీసు పూర్తికాగానే ఉద్యోగ విరమణ చేయండి! (సభలో కేక ... నువ్వే పదవీ విరమణ చెయ్యి!) అమ్మమ్మ! ఎంతమాటన్నారు ... నాకు పదవీ విరమణ అంటూ ఒకసమస్య లేనేలేదు. మీ అమాయకతకు చాలా చింతిస్తున్నా. చచ్చేవరకూ నేనే కంటెన్యూ అవుతాను. నేను లేనిదే మీరులేరు ... దేశంలేదు! ఒక వేళ చచ్చినా నాకొడుకు ... వాడి తర్వాత నా మనుమడు మాది వంశ పారంపర్యహక్కు. నేనే దేశం ... దేశం నేనే!

నోరెత్తక వినండి!

అసలు నేను రిటైరైతే దేశం అల్లకల్లోలం అవుతుంది. ఒక్కమాటు మీరు రిటైర్ అయితే మీ గతేమిటి? ఎంతమంది ఆదుకోవటంలేదు. నా వంటివాళ్ణి అలా చేయమంటారా? ఎంత దుర్భరం! జాతిగౌరవానికి అదెంత దెబ్బ! అందుకనే గిరీశమో, భర్తృహరో వాడెవడో అన్నాడు. మణిలాంటి నావంటి ఒక్కడుంటే చాలు ... తట్టెడు రాళ్ళు దేనికి? కాబట్టి నోరు మూసుకువినండి. మీ ఫేషన్ సంఘం తరఫున పదేళ్ళకి రిటైరుకు వెంటనే చారిత్రిక తీర్మానం చేయండి! అంటూ చతికిలబడ్డారు.

అధ్యక్షుడు :- ఇప్పుడు మనప్రధాన మార్గదర్శి శ్రీదోపిడి దుర్గాప్రసాద్ రిపోర్టు ఇస్తాడు. మీరంతా నిద్రపోతున్నా ఫరవాలేదు. వికటంటూ ప్రకటించాడు.

మార్గదర్శి ప్రసంగం.

మిత్రులారా! నేను దాదాపు రెండు దశాబ్దాల నుంచీ మనసంఘానికి మార్గదర్శిగా పనిచేస్తున్నాను. నేనెవళ్ళ సంగతీ పట్టించుకోను. నా జోలికి ఎవరూ రావద్దు. ఇదీ నా విధానం. నాదితలో రొట్టెముక్క సూత్రం. అరిచే కుక్కకి రొట్టెముక్క వేసేదీ ... నోరుమూయించేదీ! మనసంఘ కార్యకర్తల్ని అలావిశ్వాస పాత్రుల్నిగా చేసుకొన్నాను. నావనూళ్ళ మొత్తం ఏభైవేలు. కార్యకర్తల రొట్టెముక్కలికి ... లాడ్జింగులకి ... గద్దికి ... గాదంకి ఆదంతాపోను మళ్ళీపాతిక వేలు అప్పులో వుంది మనసంఘం. కార్యకర్తలు నిద్రమత్తుమాని వర్సంతేజి పెంచండి. సగం నాకు పారేయండి! తంత్రాల కుతంత్రాల క్లానులు పెట్టాలనుకుంటున్నాను. మనప్రత్యేకత నిలుపుకొంటూ ఇప్పుడు ఐక్యసంఘటనలో చేరేము. మనపాపం తప్పుకోటానికి మంచి ఛాన్స్ వచ్చింది. ఈ ఎతుగడతో శత్రువర్గం చిత్తు చిత్తు!' అంటూ మీసం మెలేసి రోషకషాయిత నేత్రాలతో బల్ల గుద్దేడు.

అధ్యక్షుడు :- ఇప్పుడు మనసంఘ ఏకైక మహిళా కార్యకర్త శ్రీమతి రుబ్బురోలు సుబ్బులుగారు తీర్మానాలు ప్రవేశపెడతారు.

## తీర్మానాలు

1. ఉపాధ్యాయులు 10 సం॥ల సర్వీసు పూర్తియైన వెంటనే రిటైర్ కావాలి!

(నిరసంగా చప్పట్లు. చైర్మన్ గారి బల్లగుద్దుడు)

2. దేశ ద్రవ్యోల్బణ దృష్ట్యా ఉద్యోగులందరికి ఇకపైన ఇంక్రిమెంట్లు రద్దుచేయాలి! (పిల్లికూతలతో ఆమోదం)

3. ఫేషన్ సంఘకార్యకర్తలకు అన్ని రాయితీలు కలిగించాలి. (ఆమోదం ... అందరి చప్పట్లు)

4. రొట్టెముక్క సూత్రం వర్ధిల్లాలి!

(ఆమోదం ... చప్పట్లు)

5. తంత్రాల సంఘటన జిందాబాద్!

(దీర్ఘ హర్షధ్వానాలు!)

✱

సీరియ(స్)ల్ కథలు

# (గుణ)పాఠాలు

'రత్నం'

అది నీతి బోధ క్లాసు.

"నీపేరేమిటి?" అడిగేరు నాపక్కకుర్రాణ్ణి పంతులుగారు.

"శాస్త్రి!"

"నీ పేరో?"

"ఏసోబు!"

"నీ పేర్రా?"

"హుస్సేన్!"

—అలా క్లాసంతా అడిగి 'చూశారా ... మీరు తలో కులం వాళ్ళు! తలో మతం వాళ్ళు! అయినా కలసి కూర్చుంటున్నారు. కలిసి చదువుకుంటున్నారు. ఇక్కడ మీ కులాల సంగతి, మీ మతాల సంగతి గుర్తుకురాదు. మీకు గుర్తున్నదల్లా ఒక్కటే ... 'మేమంతా బళ్ళోపిల్లలం!' అని ... 'ఫలానా క్లాసు వాళ్ళం!' అని.

దేశంలో కూడా అంతే. కులాలెన్నివున్నా ... మతాలెన్ని వున్నా మనమంతా భారతీయులం—అని భావించాలి. ఒకే మానవ జాతిగా అనుకోవాలి. — అంటూ అందరికి అర్థమయ్యేట్టు పాఠం చెప్పి పోయారు మాష్టారు.

ఆ తర్వాత పీరియడ్‌లో హెడ్మాష్టరు నుండి నోటీసు వచ్చింది ... 'అటెండెన్స్ రిజిష్టర్లలో మాపేర్ల కెదురుగా ఏమతమో .... ఏకులమో వివరం వ్రాయమని.

నిమిషంముందు కులమతాలక్కరలేదని బోధ!

మరునిమిషంలో కులమతాల్ని మర్చిపోనీయని రొద!


అప్పుడర్థం గాలేదుగాని డిగ్రీపుచ్చుకొన్న తర్వాత స్పష్టంగా అర్థమవుతున్నది.

ఉద్యోగం కావాలంటే కులం!

ఉత్సవాలంటే మతం!

అడుగడుగునా కులం ... మతం!

నీతి :- మేడిపండు వ్యవస్థలో పైపైనే మెరుపులు ... పొట్ట చీల్చిచూస్తే అన్నీపురుగులే!






# మితిమీరిన భారంతో, పసిపాపల లేతమనసులను కృంగదీయవద్దు

ప్రొఫెసర్ యస్. యస్. నటరాజన్
రిటైర్డుటీచర్ - గణితశాస్త్ర విభాగం
ఉస్మానియా విశ్వ విద్యాలయం, హైదరాబాదు

ఉపాధ్యాయులు ఎలుగెత్తి గగ్గోలు పెట్టినదానికి ఫలితం కాన వస్తోంది. సదవగాహనతో కూడిన వాతావరణం నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి. పాఠశాలల పనిగంటలు హెచ్చిం చుతూ జులై 31 వ తేదీన ఆకస్మికంగా తాము జారీ చేసిన వుత్తర్వు, తాము నయంచేయదల పెట్టిన రోగంకంటె ఎక్కువ హాని కలుగజేసే ఔషధంగా పరిణమిస్తున్న విషయాన్ని ఆంధ్ర ప్రదేశ్ విద్యాశాఖ గుర్తించినట్లు కనిపించుతోంది. ఈ ప్రయోగాన్ని గూర్చి సవ్యంగా పరిశీలించ వలసిన ఆవశ్యకతను వారి ప్పుడు గుర్తించు తున్నారు. అమాయకులయిన చిన్నారిపాపలు వారి ప్రయోగంలో పరిశోధనా వస్తువులుగా వాడబడు తున్నారు.

యస్. యస్. సి. పరీక్షా ఫలితాలు నిరాశాజనకంగా వున్నాయి. పాఠశాల పనిగంటలు,పనిదినాలు హెచ్చించడానికి ఇవి దారితీశాయి.

ఇప్పటికే బలంపెంచే మందు వాడటం ప్రారంభ మయింది.అయితే రాష్ట్రంలో గల విద్యాలయాలన్నిటి గొంతు కలలో దాన్ని బలవంతంగా పోయడం జరుగుతోంది.వారంతా గగ్గోలు పెట్టేశారు. అధికారులు పదిహేను వారాల పాటు మౌనవ్రతం పాటించారు. బడిగంటల హెచ్చింపుచేయాలనే వారి ఔషధం శారీరక, మానసిక, మేధాదృక్కోణాలను విస్మ రించి నట్లు కన్పిస్తున్నది.

అపరిపక్వమైన ఈ ఔషధాన్ని శరీరధర్మశాస్త్రవేత్తలు తిరస్కరించారు. జ్ఞానాన్ని ఆర్జించటానికి గాను ఆరోగ్యాన్ని వెళ్ళగొట్టకండి ఘోరమైన తప్పిదంకాగలదు ఎంత వుత్తమమైన మేధస్సువున్నా, దానిని వుపయోగపెట్టేందుకు అవసరమైన సత్తువ శరీరంలో లేనిదే ప్రయోజనం వుండజాలదు. మెదడుకు మితిమీరిన భారం ఆరోగ్యాన్ని దెబ్బ కొడుతుంది.

దీన్ని మన సత్వ శాస్త్రవేత్తలూ తిరస్కరిస్తారు. బల హీనంగా వున్న విభాగాన్ని వెతికి పట్టుకొని, దూరంగా నెట్టట మనేది వివక్షాపూరితమైన ధోరణి. ఆరోగ్యకరమైన పద్ధతిలో ఒక మార్గం తీసుకుని పురోగమించే అవకాశం వారికి నిరాక రించటమవుతోంది. మేధావులు ఈ పథకాన్ని త్రోసివుచ్చుతారు. మితిమీరిన మోతాదులో ప్రయోగించటాన్నే వారు వ్యతిరే కిస్తారు. ఇది బడి దినాలు, బడిగంటలు తక్షణమే తగ్గించాలనే వారి సర్వసాధారణ అభిప్రాయం. విద్యార్జన పట్ల బాల బాలి కలలో దాగివుండే కాంక్షను ద్విగుణీకృత మొనరించే విధంగా సమర్థవంతమైన, వుత్తేజపూరితమైన విద్యాబోధనకు అవకాశం కల్పించాలని వారు కోరుకున్నారు. విద్యార్థులకు ఆహ్లాదం కలి గించే పరికరాలు, పలు విధాలయిన ఆటల పాటలు, వినోద కార్యక్రమాలు, పాఠ్యాంశాలలో లేని యితర అంశాలు విజ్ఞా నాత్మకమైన చలనచిత్ర ప్రదర్శనలు, టెలివిజన్ ప్రదర్శనలు ఏర్పాటుచేసి బాలబాలికలను నిరంతరం చురుకుదనంతో వుత్సా హంతో వుల్లాసంగా వుండేట్లు చేయాలని వారు కోరుతున్నారు. జీవితంలో పాఠశాల ఒక భాగంగా వుండాలి. అంతేగాని జీవితంతో నిమిత్తం లేనిదిగా వుండరాదు. పాఠశాలంటే ఒక కారాగారం కాదు; కర్మాగారమూ కాదు.

ప్రకృతి, పోషణ రెండూ కూడా విద్య విషయంలో కీలకమైన పాత్ర వహిస్తాయి, అవి ఒక దానికొకటి తోడు నీడగా వుంటాయి. అయితే దేని పరిమితులు దానికి వున్నాయి. వూరకుక్క వేరు పోలీసు కుక్క వేరు. రెండూ ఒకటి కావు. పోలీసు కుక్క ఉత్తమ జాతికి చెందింది. ప్రకృతి పోషణ రెండూ తోడయి అది పరిణతి చెందడానికి దోహద పడ్డాయి.

ప్రతి విద్యార్థికి కొన్ని నిర్దిష్టమైన తెలివి తేటలు, శక్తి సంపత్తులు సహజ సిద్ధంగానే వున్నాయి. అందులో కొందరిని తెలివిగలవారని, మరి కొందరిని సగటు స్థాయి లోనివారని, మరికొందరిని వెనుకబడిన వారని ముద్ర వేయటం దారుణమైన తప్పిదం చేయుటమే అవుతుంది.

ఒక గంటపాటు అజమాయిషి చేస్తూ చదివించడం, వెనుక బడివున్న వారికి ప్రత్యేక బోధన చేయడం కొంత మందిని, మొద్దబ్బాయిలుగా ముద్ర వేయుటమే అవుతుంది. అందువల్ల వ్యక్తి గౌరవాన్ని, ప్రతిష్ఠను కించపరచటమే అవుతోంది.

మన బాల బాలికలు ప్రాతః కాలపు చలిలో రగ్గులు దుప్పట్లు కప్పుకొని ముడుచుకొని పండుకొని వుంటారు వారు అయిష్టతతోనే బాధపడుతూనే పడక మీదినుండి లేస్తారు సాధారణంగా వేళప్రకారం నడవని శివారు రైళ్లనో, కిక్కిరిసి వుండే బస్సులనో అందుకొనటంకోసం వారు హడావుడిగా తయారవుతారు. వారు తమ ప్రాథమిక శారీరక జాగ్రత్తల విషయం విస్మరిస్తారు.

బాలబాలికలలో అత్యధిక సంఖ్యాకులకు తగిన ఆహా పోషణలేదు. తగిన దుస్తులులేవు తలదాచుకొనటానికి తగిన నీడలేదు. ఇంతేకాదు పాఠశాలల్లో హెచ్చు భాగానికి అవసర మైన సాధన సామాగ్రిలేదు. తగిన తరగతి గదులులేవు. కొన్ని పాఠశాలలు గిడ్డంగులవలె వుంటాయి.మరికొన్ని మధ్యయుగాల నాటి శిథిలాలవలె వుంటాయి. మరికొన్ని పదవ శతాబ్దం నాటి మొగలుపాలన కాలపు భవనాలువలె వుంటాయి. పాఠశాల స్థలాలు. తెలివయిన వ్యాపారాలవారికి పాఠశాల పరిశ్రమ వాటమైన లాభసాటి వ్యాపారంగావున్నట్లుంది. బాల బాలికల

పసివాడిన వదనలతో నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ సాయంత్రం ప్రొద్దుగ్రుంకిన తర్వాత యిళ్ళకు చేరుకుంటున్నారు.

మార్చి, ఏప్రిల్ నెలలు మినహా మిగతా మాసాలలో రోజుకు ఐదు గంటలబడి చదువులతోనే నిజానికి పలువురు అగ్రశ్రేణిని అందుకున్నారు. జాతిజీవనంలో వున్నతస్థానాలను అందుకోవటానికి తమకు అవకాశం కల్పించిన ఆ ఐదు గంటల బడి పద్ధతిలో లోటుపాట్లు కలవని మన ఐసియస్, ఐ.ఎ. యస్ అధికారులు ఎన్నడూ భావించలేదు. ఉదయం 9-30 నుండి 12-30 వరకు, మధ్యాహ్నం 1-30 నుండి 3-30 వరకు రోజుకు ఐదు గంటలు బడి జరిగితేనే మేలు. ఎండలు మండే మార్చి ఏప్రిల్ మాసాలలో ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు మూడు గంటలపాటు బడినడపడం ఆరోగ్యానికి మంచిది. ఉదయపుబడి అన్న పేరుకు తగివుంటుంది. బాలబాలికలను ఎండదెబ్బ తగిలే ప్రమాదానికి గురి చేయటం తగదు. మధ్యాహ్నం అయ్యేసరికి వారు యిళ్ళకు చేరుకోవాలి.

బడి గంటలు వ్యవధి అధికమయిన కొలదీ బాలబాలికలకు లేత శరీరాలు ఆరోగ్యానికి ప్రమాదం అధిక మవుతుంది. బడిలో చెప్పే పాఠాలు వినుగెత్తించుతాయి: బుర్రకెక్కవు. విద్యాప్రమాణాలను పెంచక పోగా, విద్యార్జన అంటేనే మొఖం మొత్తుతుంది ఈ పధకం కేన్సరు వలె కుంగదీస్తుంది.

బాలబాలికల మెదడులను అజ్ఞాపించేందుకు వీలులేదు. ఎంత విజ్ఞానాన్నయినా అందులోకి ఎక్కించడానికి వీలయినట్టిదిగా పరిగణించరాదు. అహ్లాదకరమైన వుత్తేజ కల్పన ద్వారా స్వీయాభివృద్ధి కార్యక్రమాన్ని ప్రోత్సహించ వలసి యుంటుంది. బాలబాలికలకు ఎంత తక్కువగా చెప్పటానికి వీలయితే అంత తక్కువగా చెప్పటం, కొత్త విషయాలు కని పెట్టేందుకు ఎంత హెచ్చు ప్రోత్సాహం యివ్వటానికి వీలయితే అంత హెచ్చుప్రోత్సాహం ఇవ్వడంమంచిది. చదరంలో ఒక మూలను మాత్రమే వారికి చూపాలి.

విద్యఅంటే నోట్లో వేసుకుని మ్రింగటం వంటిదికాదు. విద్యఅనేపదంయొక్క ఉత్పత్తి అర్థమే ఈభావానికి వ్యతిరేకం. విద్య అంటే—బిడ్డయొక్క మానసికశక్తిని వికసింపజేసి, శిక్షణ యిచ్చి, అవగాహనను పెంపొందింప జేయుటం అనిఅర్థం. పాఠశాలజరిపే కాలవ్యవధి తక్కువయినకొలదీ, విద్యార్జన మరింత ఆరోగ్య ప్రదంగావుంటుంది. తొందరపాటుగా బలవంతాన అదనపు భారాన్నిరుద్దితే శారీరక, మానసిక, మేధో సంబంధమైన దృక్కోణాలరీత్యా విద్యను అధఃపాతాళానికి త్రొక్కటమే అవుతుంది. మనబాలబాలికల ఆరోగ్యాన్ని పెంపొందించటానికై వివేకంతో వ్యవహరించటం జరగగలదని ఆశించుదాం. (హిందూ సౌజన్యంతో)

---

# మనము-మన ఆరోగ్యం

## కలరా - నివారణోపాయాలు

డా. శ్రీ యం. రామారావు, యం.బి.బి.యస్.

కలరా వ్యాధి 'విబ్రియో' కలరా' అనబడే సూక్ష్మ క్రిముల వలన వస్తుంది. కలరా రోగుల వాంతులలోను, విరోచనాలలోను ఈ క్రిములు హెచ్చుగా వుండును.

**వ్యాధి లక్షణాలు:** ఈ వ్యాధి విరోచనములతో ప్రారంభమగును. త్వరలో వాంతులగును. విరోచనములు ఎక్కువగా గంజి నీటువలె నగును. విపరీతమైన వళ్ళునొప్పులు, విపరీతమైన నీరసం ఆవరించును, నాడి బలహీనమగును. వళ్ళు చల్లబడును. ఈ దశ యెంత ఎక్కువకాలం వుంటే రోగం అంత ప్రమాదకరం, తగిన చికిత్స జరిగిన వారిలో మరియు జబ్బు తట్టుకున్న వారిలో నాడి మెరుగుపడును, శరీరము వెచ్చగా నగును, మూత్రము పరిమాణము క్రమముగా పెరుగును. వ్యాధి సోకిన వారిలో అనేకమంది మరణించెదరు పిల్లలలోనూ, ముసలి వారిలోను ఈ జబ్బు ప్రమాదకరము.

**చికిత్స:-** వాంతులు, విరోచనములు అగుట వలన శరీరము నీరు క్లోరయిడ్స్ ఎక్కువగా నష్టపోవును 'సోడియం క్లోరడ్ (ఉప్పునీరు) రక్తనాళముగుండా ఎక్కించవలయును. (ఇది ఆస్పత్రులలో మాత్రమే చేయవలసిన పని) రోగికి సంపూర్ణమైన విశ్రాంతి కొద్దిపాటి వెచ్చదనము అవసరము.

సల్ఫాగనేడియన్ ప్రారంభంలో నాలుగు మాత్రలు తరువాత ప్రతి నాలుగు గంటలకు రెండు మాత్రలు చొప్పున వాడవలెను (3)కోయలన్ పొడరు రోజుకు 4 చెంచాలు చొప్పున వాడవలెను.

క్లోరొమైసెటిన్, ఎరిత్రొమైసిన్ మొదలైన మందులు కూడా వాడవచ్చును.

**నివారణోపాయాలు :-** కలరా రోగుల వాంతుల లోని విరోచనములలోను కలరా క్రిములు విపరీతముగా వుండును. మనము తినుకొను ఆహారముగాని, త్రాగేనీరుగాని ఈ క్రిములతో కలుషితమైన మనకు కలరా సోకును. ఈగలు ఆహార పదార్థాలను కలుషితం చేయుటంలో ముఖ్య పాత్ర వహిస్తాయి. అశుభ్రత, అజాగ్రత్త ప్రమాదకారులు.

1. కలరా నిరోధక ఇంజక్షన్ చేయించుకొనవలెను. దీనివలన షుమారు ఆరునెలలవరకు వ్యాధి నిరోధకశక్తి పెరుగును. 2.కలరావ్యాప్తిలోనున్నప్పుడుకాచి చల్లార్చినలేక బ్లీచింగ్ పౌడరు కలిపిన నీరువాడవలెను. 55%సి. దగ్గర 15 నిముషములు వేడిచేసిన కలరా క్రిములు చనిపోవును. బ్లీచింగ్ పౌడరు, సున్నం, పొటాషియం పెర్మాంగనేటు మొదలైన క్రిమిసంహారక ద్రావకములు వున్నచోట కలరా క్రిములు మనజాలవు.3.బాగుగావండినఆహారపదార్థాములనేవాడవలెను

(మిగతా పక్క కాలంలో)

4. ఆహార పదార్థాములను ఈగలనుండి దుమ్మునుండి కాపాడవలెను.

5 అతిగా తినుట, పచ్చివి, ఎక్కువ పండిన పండ్లు చేపలు వాడుట మంచిదికాదు.

6. బజారులో సోడా, కూల్ డ్రింక్స్ ఐస్ క్రీం మొదలైనవి త్రాగరాదు. బజారులో చల్లబడిన పదార్థములు తినరాదు. కలరా రోగులను ప్రత్యేకమైన గదిలో వుంచవలెను. మలమును,వాంతులనుజాగ్రత్తగా పారవేయవలెను.రూములో బ్లీచింగు పౌడరుగాని, సున్నం కాని చల్లవలెను.



# పాఠ్య గ్రంధాల తీరు

## తెన్నులు-5

# అవసరమైనచోట వివరణలు లేని పాఠ్యాంశాలు

శ్రీ యస్.వి. బసవయ్య

ఉపాధ్యక్షుడు, గుంటూరు జిల్లా యు.టి.యఫ్

(గత నాలుగు వ్యాసాలలోనూ సాంఘిక శాస్త్రానికి సంబంధించిన అన్ని పాఠ్యగ్రంథాలనూ స్థూలంగా పరిశీలించి పరస్పర విరుద్ధ విషయాలను వివరించటం జరిగింది. పాఠ్య గ్రంథాలలో అవసరమైనచోట తగు వివరణలు లేవనీ, అనవసర మైనచోట చేటభారతంగా వ్రాయబడినవనీ బోధకుల సౌక ర్యార్థం అవసరమైన వివరణలు కావాలనీ పలువురు పాఠకులు సూచించటంతో దానికి పూనుకొంటున్నా. పాఠకులు సహక రించి తమ తమ అభిప్రాయాలు తెలియజేయండి —రచయిత)

**బ్రాడ్ గేజి-మీటర్ గేజి :-** మద్రాసు-బొంబాయి రైలుమార్గము చిత్తూరు, పాకాల, వాయిల్పాడు, కదిరి, ధర్మ వరం, అనంతపురం, అదోని, మొదలగు స్టేషనులను కలుపు చున్నది' (9 వ. త. సాం. శా. 163 పే)

మద్రాసునుండి బొంబాయికి బ్రాడ్ గేజిపై రైలు వెళ్లును. కాని రచయితలు చూపిన మార్గం మీటర్ గేజ్. ఈ మార్గం గుండా బొంబాయికి వెళ్లే రైళ్ళు వెళ్ళవు 162 పేజీలో చూపిన రైలుమార్గాల పటంలోగూడా మీటర్ గేజ్ చూపించారు. రాయటంలో అడ్డదారితొక్కారు.

**వుడ్స్ డిస్పేచ్ :-** "విద్యారంగంలో తర్వాత జ్ఞాపకం ఉంచుకోతగ్గది. క్రీ.శ. 1854లో ప్రవేశింపబడిన వుడ్స్ డిస్పేచ్" (7 వ. త. సాం. శా. 178 పే.)

"ప్రాథమిక విద్యకు ప్రాముఖ్యతనిస్తూ 1854లో వుడ్స్ డిస్పేచ్ ప్రవేశపెట్టబడినది. (195 పే.)

ఏమిటీ వుడ్స్ డిస్పేచ్ ?

పూర్వాపరాలు తెలియ చెప్పకుండా కేవలం ఒక వాక్యంలో చెప్పే సరిపోతుందా ?

విద్యావిధానంపై రిపోర్టు తయారు చేయటానికి బ్రిటిష్ పార్లమెంటు ఒక కమిటీని వేసింది. ఆ కమిటీ అధ్యక్షుడు సర్ ఛార్లెస్ ఉడ్. ఆ రిపోర్టును 'ఉడ్స్ డిస్పేచ్ అంటారు.

**కాంటూర్ బండింగ్స్, సోపానవ్యవసాయము:** (10వత. సాం. శా.)

వీటికి వివరణలేదు. పర్వత ప్రాంతాలలో నేలకోసు కొని పోకుండా భూసార పరిరక్షణకై ఒకే ఎత్తుగల ప్రదేశం చుట్టూ కట్టలు పోస్తారు. అయా ఎత్తులన్నిబట్టి అలాంటి కట్టలు ఆ కొండచుట్టు అనేక లెవెల్స్‌లో పోయవచ్చు. వాటివలన నీటి ప్రవాహాలకు నేలకోసుకొని పోదు. అక్కడ వీలునుబట్టి స్వల్పకాలిక చెట్టుపైరులు పండిస్తారు. అలాగో ఆ అడ్డు కట్టల్నే 'కాంటూర్ బండింగ్స్' అంటారు.

**సామాన్య వ్యవసాయము:-** నేల సమతలంగా లేక ఎగుడు దిగుడుగా నున్న ప్రదేశాలలో, సమతలము కల్గిన చిన్న చిన్న ఖండములుగా విభజించి, మడులు కట్టి, ఎత్తుమడి నుండి పల్లపు మడికి, దానినుండి అంతకన్నా పల్లపు మడికి నీటి సదుపాయం కలుగ జేసి వ్యవసాయం చేయటాన్ని "సోపాన వ్యవసాయం' అంటారు. మన రాష్ట్రంలో తెలం గాణా ప్రాంతంలోను, రాయలసీమలోని కొన్ని ప్రదేశాల లోను, సాగర్ కాల్వలక్రింద ఎత్తు పల్లాల భూములలోనూ ఈ వ్యవసాయ పద్దతి ఉంది. ప్రపంచంలో ఇండియాలో, చైనా, జావాలలో యీ పద్దతి ఎక్కువగా అమలులో ఉంది.

**ఉక్కు తయారు:-** (8 వ త. సాం. శా 41 పే)

ఇనుము-ఉక్కు తయారుచేయుటకు కావాల్సిన ముడిపదార్థా లలో రచయితలు 'అభ్రకాన్ని' పేర్కొన్నారు. పాపం మాంగ నీసు' అని వ్రాయబోయి అభ్రకం అని వ్రాసి ఉంటారు.

'చేత ఇనుములో కొద్దిగా కర్బనమును కలిపిన అది ఉక్కుగా తయారగును' (6 వ త. సైన్సు) అని మాత్రం వ్రాశారు.

కాని ఈ క్రింది వివరణ అవసరం. చేత ఇనుమునకు "స్పైజల్' (కార్బన్, మాంగనీసు, ఇనుముల మిశ్రమము)ను కల్పిన ఉక్కు తయారగును. ప్రత్యేక రకాల ఉక్కులను ఈ క్రింది విధంగా తయారుచేస్తారు.

(1) ఇనుము + నికెల్ = నికెల్ ఉక్కు.

(2) ఇనుము + క్రోమియం + నికెల్ = స్టెయిన్ లెస్ స్టీల్.

(3) ఉక్కు + క్రోమియం = క్రోమియం ఉక్కు.

# మరికొన్ని స్ఖాలిత్యాలు

శ్రీ కె. శేషయ్య, చేగొమ్మ

4 వ తరగతి తెలుగు వాచకములో 60 వ పేజీలో 'గణపతి దేవుడు క్రి. శ. 1198 నుండి 1262 వరకు కాకతీయ సామ్రాజ్యమును పాలించెను.

అదే పేజీలో 'క్రి.శ. 1261లో 54 వ పేజీలో రుద్రమ దేవి కాకతీయ సామ్రాజ్యమునకు రుద్రమదేవి చక్రవర్తిని అయిందని వ్రాయబడింది.

4 వ తరగతి సాం.శా. లో 54 వ పేజీలో 'కార్డు ధర 10 పై. ఇన్‌లాండు కవరు ధర 15 పై అని ఉంది.

వీటి ధర పెరిగిన విషయం తెలియనట్లే ఉంది పాపం !



# నియమ నిబంధనలు

## ఇతర శలవులు

**శ్రీ బి. నరసింహారావు**

ఇంతవరకు వివరింపబడిన శలవులు (సంపాదితశలవు మొ॥) గాక ఉద్యోగులకు ప్రాథమికనియమాల (ఫండమెంటల్ రూల్స్) ప్రకారం కొన్ని ప్రత్యేక శలవులున్నాయి. అవి 1) ప్రసూతి శలవు 2) హాస్పిటల్ శలవు 3) ప్రత్యేకశక్తి వైకల్యపు శలవు 4) విద్యాశలవు. ఇవి ఉద్యోగుల శలవు ఖాతాలకు జమకట్టబడవు.

**ప్రసూతి శలవు [మెటర్నిటీలీవు]:** ప్రసూతి శలవు వివాహిత ఉద్యోగినులకు ప్రసవ సమయంలో ఈయబడుతుంది. శాశ్వత ప్రభుత్వ ఉద్యోగినులకు రెండు నెలలు ప్రసూతి శలవు మంజూరు చేయబడుతుంది. తాత్కాలిక ఉద్యోగినులకు వారికి అర్హతవున్న పూర్తి జీతపు శలవు మంజూరు చేయబడుతుంది. పూర్తి జీతంతో వచ్చే శలవుకు అర్హత లేనప్పుడు వారికి రెండు నెలలకు మించకుండా ప్రసూతి శలవు మంజూరు చేయబడుతుంది. అర్హతవున్న పూర్తి జీతపు శలవు 2 నెలలకు తక్కువగా ఉన్నపుడు మిగిలిన కాలానికి మాత్రమే వారికి ఆ శలవు మంజూరు చేయబడుతుంది.

ఉదాహరణకు ఒక తాత్కాలిక ఉద్యోగినికి నెలావదిహేను రోజులు సంపాదిత శలవు ఉన్నదనుకోండి. ఆమెకు 15రోజులు మాత్రమే ప్రసూతి శలవు మంజూరు చేయబడుతుంది.

ప్రసూతి శలవుకు పూర్తి జీతం వస్తుంది.

ఈ మధ్య జారీచేయబడ్డ జి ఓ. యం. యస్. నెం. 943 (యం. అండ్ హెచ్) తేదీ 27-9-76 ప్రకారం ఇద్దరు పిల్లలున్న ఉద్యోగులకు తర్వాత వచ్చే కాన్పులకు ప్రసూతి శలవు మంజూరి చేయబడదు.

గర్భస్రావం జరిగినప్పుడు కూడా ఆరు వారాలకు మించకుండా ఉద్యోగినులకు ప్రసూతి శలవు మంజూరు చేయబడుతుంది.

ప్రసూతి శలవును ఇతర రకాల శలవులతోపాటు వాడుకోవచ్చు. పుట్టిన శిశువుకు జబ్బుచేసినప్పుడు ఉద్యోగినులు తమకు అర్హత వున్న ఇతర శలవులను ప్రసూతి శలవుతోపాటు వాడుకోవచ్చు. (ఎఫ్. ఆర్. 101 ఎ)

**హాస్పటల్ శలవు:—** తమ బాధ్యతా నిర్వహణలో ప్రత్యేకప్రమాదాలకు, అనారోగ్యానికి గురియైనపుడు ఈ శలవు మంజూరు చేయబడుతుంది. ఉదా॥ పోలీసులు, ఫారెస్టుగార్డులు తమ విధి నిర్వహణలో ప్రమాదాలకు గురి అయ్యే అవకాశాలున్నాయి. అంటు వ్యాధుల నివారణాకార్య క్రమంలో ఉండే వైద్య, ఆరోగ్య సిబ్బందికి అంటు వ్యాధులు సోకే ప్రమాదముంది.

కొన్ని శాఖలలో (ఉదా:- పోలీసు. ఫైర్ సర్వీసు, ప్రభుత్వప్రెస్ మొ॥ ) పని చేసే తాత్కాలిక ఉద్యోగులకు కూడా హాస్పటల్ శలవు ఉంటుంది. మిగిలిన తాత్కాలిక ఉద్యోగులకు ఈ శలవు వుండదు.

పూర్తిచేసిన ప్రతిమూడు సంవత్సరాల సర్వీసుకు ఆరు నెలల హాస్పటల్ శలవు ఉంటుంది.

ఈ శలవుకు అర్ధజీతం మాత్రమే వస్తుంది. ఉద్యోగి తన బాధ్యతా నిర్వహణలో జబ్బుకుగాని, ప్రమాదానికిగాని గురియైనపుడు అతనికి మూడునెలలకు మించకుండా పూర్తిజీతం మంజూరు చేయబడవచ్చు అలాపొందేందుకు ఉద్యోగి జబ్బు పడటానికిగాని, ప్రమాదానికిగురికావటానికిగాని తనఅజాగ్రత్త కారణంకాదని తగుఅధికారితో పొందిన సర్టిఫికెట్ సమర్పింపవలసివుంటుంది.

హాస్పటల్‌లో చేరిగాని, బయటవుండిగాని వైద్యం పొందుతున్నప్పుడే ఉద్యోగికి ఈ శలవు మంజూరు చేయబడుతుంది. (ఎఫ్. ఆర్. 101 బి)

**ప్రత్యేక పరిస్థితుల్లో శక్తి వైకల్యపుశలవు (స్పెషల్ డిజబిలిటీ లీవు) :-** తన బాధ్యతా నిర్వహణలో కలిగిన ప్రమాదం, లేక తగిలిన దెబ్బవల్ల శక్తిహీనుడై ఉద్యోగం చేయలేని ఉద్యోగికి యీ శలవు మంజూరు చేయబడుతుంది. ఇది రెండు సంవత్సరాలకు మించరాదు. ఈ శలవుకు యితర శలవులతోబాటు వాడుకోవచ్చు.

ఈ శలవు కాలంలో మొదటి నాల్గునెలకు పూర్తి సగటు జీతం వస్తుంది. మిగిలిన కాలానికి అర్ధజీతం వస్తుంది. నాల్గునెలలకు మించి కూడా సగటు జీతం మంజూరు చేయబడవచ్చు. నాల్గు నెలలకు మించి ఎంతకాలం పూర్తి జీతం వస్తుందో అంతులో సగం కాలం మాత్రమే శలవుఖాతాకు జమకట్టబడుతోంది. (యఫ్. ఆర్. 83)

ఉదా :— ఒక ఉపాధ్యాయుడు తన పాఠశాలలోని విద్యార్థులను విహార యాత్రకు తీసుకువెళ్తూ రైలు ప్రమాదానికో బస్సు ప్రమాదానికో గురియై ఉద్యోగం చేయటానికి అశక్తుడయ్యాడనుకోండి. అప్పుడు ఆయనకు యీ ప్రత్యేక శక్తి వైకల్యపు శలవు మంజూరు చేయబడుతుంది.

**విద్యా శలవు (స్టడీ లీవు) :-** శాస్త్రీయ విషయాలు, సాంకేతిక విషయాలు మొ॥ చదివేందుకుగాని, ప్రత్యేక శిక్షణ పొందేందుకుగాని ఉద్యోగికి ఇచ్చు శలవును స్టడీ లీవు అంటారు.

నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు సాధారణంగా ఈ రకమైన శెలవుండదు. ప్రత్యేక పరిస్థితులలోనే వారికి యీ శలవు మంజూరు చేయబడుతుంది. దీనిని మంజూరు చేసే అధికారం ప్రభుత్వానికి మాత్రమే ఉంది. ఈ శలవు కాలంలో ఉద్యోగికి అర్ధ జీతం వస్తుంది.

# ప్రశ్నోత్తరాలు

శ్రీ పి. వీరరాఘవయ్య, డ్రాయింగు మాస్టారు, వెలిదుర్తి, గుంటూరు జిల్లా

ప్రశ్న :- మార్చినెల సంచికలో "విద్యా సంవత్సరము మధ్యలో ప్రభుత్వముచే అక్రమ బదిలీల ఉత్తర్వు రద్దు" అని ప్రచురించిరి. అన్ని జిల్లాలలోనా? లేక ఒక్కొక్క జిల్లాకా? మాకెప్పుడు జారీ అగును?

జవాబు :- అన్ని జిల్లాలలో కాదు. లేక ఒక్కొక్క జిల్లాకు కాదు. తూర్పు గోదావరి, నల్గొండ జిల్లాలకు సంబంధించిన శ్రీయం. నాగేంద్రరావు, శ్రీ పి. సత్యన్నారాయణగార్ల అక్రమ బదిలీల రద్దుకు సంబంధించిన పరిమితమైన వార్త అది. క్రమ విరుద్ధమైన ట్రాన్స్‌ఫర్లు మీ జిల్లాలో జరిగిన యెడల మీ జిల్లా శాఖ ద్వారా ప్రభుత్వం దృష్టికి తెచ్చినప్పుడు, మీ జిల్లాలో కూడా, అటువంటి రద్దు ఉత్తర్వులు జారీ కావచ్చును.

శ్రీ కె. నిత్యజీవనరావు, కండక్టరు, పి.యస్.యు.డి.యస్. రావికంపాడు.

ప్రశ్న :- కండక్టరులకు క్యాజువల్ శలవులు ఉన్నవా? ఉంటే, సమితి స్కూలులో పనిచేస్తూన్న నాకు వర్తించునా? జి. ఓ. నెంబరు తెలియపర్చండి.

జవాబు: కంటెన్‌జెన్సీలనుండి జీతములు పొందుచున్న మీకు క్యాజువల్ శలవులు లేవు. అయితే అంటువ్యాధుల సందర్భములో తాత్కాలికముగా దుర్బలపడినప్పుడు టీకాలు వేయించుకొనుటకు రెండురోజులు, జి.ఓ.యం యస్. నెం1114 ప్లానింగు మరియు లోకల్ అడ్మినిస్ట్రేషను (ఎస్టాబ్లిష్‌మెంటు III) తే 22-8-62లోని ఆదేశము మేరకు మంజూరు చేయబడుటకు అవకాశముంది ఈ జి ఓ లోని A servant of Panchayat Samithi or Zillaparshad paid from Contengencies shall not be entitled to ordinary casual leave but may be granted special casual leave when temporarily in capaciatated for two days due to in oculation for and epedemic disease such as small-pox cholera, or typhoid' అనియున్న ఆదేశమును పరిశీలించండి.

శ్రీ సి. అమృతరావు, మచిలీపట్నం, కృష్ణాజిల్లా.

ప్రశ్న :- సమితి పాఠశాలల్లో తెంపరరీగా నియమించ బడిన కొందరు ఉపాధ్యాయుల జీతాలనుండి, వేసవి శలవుల జీతమును పూర్తిగా పొందుటకు అర్హతలేదని, కొంత రికవరీ చేయుట జరిగింది వేసవి శలవులకు ముందు వారికి ఆరునెలల సర్వీసుఉంది. ఈ రికవరీ విషయములో రూల్సుమేరకు పూర్తి సమాచారమును తెలియ జేయండి.

జవాబు :- వేసవి శలవులలో తాత్కాలిక ఉపాధ్యాయులను కొనసాగించుటకు ప్రభుత్వం జారీచేసిన జి ఓ ఆర్.టి. నెం. 567 ఎడ్యుకేషన్(జి)డిపార్టుమెంటు తేది 23-4-1975లో, నాన్‌గవర్నమెంటు పాఠశాలల తాత్కాలిక ఉపాధ్యాయులకు జి ఓ.యం.యస్. నెం. 112 ఎడ్యుకేషన్ తేది 16-2-1974లో ఆదేశించిన 5 సూత్రముల మేరకు సమ్మర్ వెకేషనులో ప్రొపోర్షనల్ జీతములు బట్వాడాచేయవలసినదిగా సూచించుట జరిగింది. ఆ సూచనలమేరకు మీరు చెప్పిన ఉపాధ్యాయులకు రికవరీలు జరిగినట్లుగా అభిప్రాయపడుచున్నాం. ఈ 5సూత్రము లను ఇందులో సమోదు చేస్తున్నాం. పరిశీలించండి రికవరీలు ఎక్కువ చేసిన యెడల తిరిగి వాపసు యిప్పించుటకు కృషి చేయండి.

సూత్రములు :- 1. All teachers under all managements be paid full vacation salary, if they had worked for full academic year. 2) All teachers under all managements be paid proportionate vacation salary if they had worked for more than sixmonths but not full academic year 3) All teachers under all managements who have put in service of three months and above but less than six months should be paid half vacation salary 4) All teachers under all managements who may be ousted from service for want of vacancies or for any other reasons, should be paid vacation salary as per the conditions laid down in items 1. to 3. above and 5) All teachers under all managements, who resign the temporary appointment need not be paid any vacation salary at all what ever the period of service put in by during the academic year.

శ్రీ కె. మార్కండేయులు, చిర్రావూరు, గుంటూరుజిల్లా;

ప్రశ్న :- నేను పంచాయితీ సమితి ఎలిమెంటరీ స్కూలులో 18 సం॥లు హయ్యర్‌గ్రేడు సర్వీసు కలిగి యున్నాను. సెకండరీ గ్రేడు పోస్టుగుటువలన తే 1-5-74న నా పోస్టు సెకండరీ గ్రేడు పోస్టుగా అప్‌గ్రేడు అయినది. నేను హెడ్మాష్టరుగా ప్రమోషను పొందుటకు, సెకండరీ గ్రేడు సర్వీసుతోపాటు నా హైయ్యరు గ్రేడు సర్వీసునుగూడ కలిపి లెక్కించుటకు అవకాశముందా? తెలియజేయండి.

జవాబు:- అటువంటి అవకాశము లేదు. మీ సెకండరీ సర్వీసు మాత్రమే లెక్కించుదురు.

శ్రీ బి. ఆర్. టూగూర్ పాత సత్యవరం, విశాఖ జిల్లా.


ప్రశ్న:- పని గంటలు బడిదినాలు 7 వ తరగతి వరకు తగ్గిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులో; ప్రాధమిక పాఠశాలలకు పూర్వము 5-00 గం॥లకు వుండగా 5-30 గం॥లకు నిర్ణయించారు. ఈ విషయమై ఏమి చేశారు?

జవాబు:- ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్ళడం జరిగింది. ప్రాధమిక పాఠశాలలకు 5-00గం. లకు తగ్గిస్తూ ఉత్తర్వులు ఇస్తామని తెల్పిరి.

శ్రీ జి. జయప్రతాపరెడ్డి బుజిలాపూర్, నల్గొండ జిల్లా.

ప్రశ్న:- భార్యాభర్తలు వుద్యోగులు అయినప్పుడు వారిలో ఏ ఒక్కరు కుటుంబనియంత్రణ ఆపరేషన్ చేయించు కున్నను, వారిద్దరికీ ప్రోత్సాహక యింక్రిమెంట్లు ఇస్తారా?

జవాబు:- విషయం ప్రభుత్వ పరిశీలనలో వుంది.



## నిర్బంధ డిపాజిట్ పథకం పొడిగించే ఆలోచన విరమించాలి !

### రాష్ట్ర యు.టి యఫ్. డిమాండు

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం జనవరి 11, 12 తేదీలలో విజయవాడ రాష్ట్ర కార్యాలయంలో శ్రీ కె నారాయణరావు అధ్యక్షతన జరిగింది. ముందుగా ఉద్యమనిర్మాత లక్ష్మయ్యగారితండ్రి శ్రీచెన్నుపాటి వీరయ్యగారిమరణానికి శ్రద్ధాంజలి ఘటించబడింది శ్రీ ఎ. వెంకటస్వామి (ప్రధాన కార్యదర్శి) సంఘ నివేదిక,శ్రీ యం. వెంకటరత్నం పత్రికానివేదిక,శ్రీయం.నరహరి హైదరాబాద్ సబ్ ఆఫీసు నివేదిక ప్రవేశపెట్టారు. వివిధజిల్లాల నివేదికలు ప్రవేశపెడుతూ శ్రీ వి. మల్లిఖార్జునరావు (ఖమ్మం) శ్రీ వి. సత్యనారాయణ (ప్రకాశం) శ్రీ సి. మహాదేవరెడ్డి (చిత్తూరు) శ్రీ వి. సూర్యనారాయణరాజు (తూ గో.) శ్రీ ఆర్. రామిరెడ్డి (మహబూబ్ నగర్) శ్రీ యం. నరహరి (హైదరాబాదు) శ్రీ యం. వెంకటరామయ్య (కర్నూలు) శ్రీ యం. కోటయ్య (ప్రకాశం) శ్రీ కె. భద్రయ్య (వరంగల్) గార్లు చర్చల్లో పాల్గొని ఉద్యమ పురోగతికి తగు సూచనలు చేశారు. ప్రధాన కార్యదర్శి జవాబు చెప్పిన పిదప నివేదికలు ఆమోదింపబడినవి.

పత్రికా క్యాంపెయిన్‌పై శ్రీ యం. వెంకటరత్నం, సభ్యత్వ క్యాంపెయిన్‌పై శ్రీ డి. రామిరెడ్డి, జనరల్‌ఫండ్ క్యాంపెయిన్‌పై శ్రీ జి. లక్ష్మయ్య నివేదికలు ప్రవేశపెట్టగా సభ్యులు చర్చల్లో పాల్గొని వాటికి మెరుగులు దిద్దేరు. 6 వేల పత్రికలు, 20 వేలసభ్యత్వం, 50 వేల జనరల్ ఫండుకుగాను కోటాలు తీసుకున్నారు.

సమస్యలపై చర్చను శ్రీ కె. నారాయణరావు ప్రారంభించగా శ్రీ డి.రామిరెడ్డి విశదీకరించారు. అనేకమంది సభ్యులు నేడు ఉపాధ్యాయుల్ని వేధిస్తున్న అనేక జనరల్, వ్యక్తిగత సమస్యల చర్చలో పాల్గొని పరిష్కారానికి కృషిచేయవలసిన ఆవశ్యకత తెల్పారు. అనంతరం యీ క్రింది తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదింపబడ్డాయి.

1. అశాస్త్రీయమైన బడిగంటల, పనిదినాల పెంపుదలకు వ్యతిరేకంగా జె.సి.టి.ఎ ఆధ్వర్యాన రాష్ట్రవ్యాపితంగా జరిగిన ఆందోళన ఫలితంగాను, జె.సి.టి.ఎ నాయకత్వంతో ప్రభుత్వం జరిపిన చర్చల ఫలితంగాను 7వ తరగతివరకు బడి గంటలు, పనిదినాలు తగ్గించుతూ ఉత్తర్వు వచ్చింది. కాని 7వ తరగతి వరకు పూర్వం రోజుకు 5గంటలు ఉండగా దానిని గం. 5½గా చేయటం జరిగింది. అంతేగాక యీ ఉత్తర్వు వలన హైస్కూళ్లలో 7వ తరగతివరకు ఒక పద్ధతి, ఆ పై తరగతులకు మరొక పద్ధతి అమలు జరపటం గందరగోళ స్థితిని కల్పిస్తున్నది. అశాస్త్రీయమైన యీ పెంపుదల హైస్కూళ్ళలో కొనసాగించటం ఏ మాత్రం సమంజసం, సమర్థనీయంకాదు. కాన అన్ని పాఠశాలలలోను పొరుగు రాష్ట్రాలవలె సం॥నకు 200 రోజులు, వారానికి 5 రోజులు, రోజుకు 5 గంటలు బడి దినాలు, పని గంటలుగా అమలుజరుప కోరుచున్నాము.

(2) 1974 జూలై నెలలో విధించిన నిర్బంధ డిపాజిట్ పథకం, 76 జూలై కాలపరిమితి ముగిసినా 77 సం. వరకు కూడా పొడిగించడం జరిగింది. తిరిగి దానిని 78 సం.వరకుకూడా పొడిగించనున్నట్లు వార్తలు రావటం ఉద్యోగులలో తీవ్ర అసంతృప్తికి కారణమయింది. ఇందువల్ల ఉద్యోగులకు రావలసిన వేయి కోట్లు సంభించిపోయి వారి కొనుగోలుశక్తి పడిపోవటం జరిగింది. వస్తువుల డిమాండు తగ్గి ఉత్పత్తి దెబ్బతిని, ఆర్థిక వ్యవస్థ తారుమారయింది. ఇంతేగాక ప్రకటించిన డివిడెండ్ల గరిష్ట పరిమితిని ఉపసంహరించటం బ్యాంకుల విధానం సడలించడం జరిగింది. ఫలితంగా ద్రవ్య సరఫరా ప్రమాణం పెరిగి ధరలు పెరిగాయి. కాన ప్రభుత్వం ఈ కల్లోలానికి కారణమైన నిర్బంధ డిపాజిట్టు పథకం పొడిగించే ఆలోచనను విరమించాలని ఉద్యోగుల కార్మికుల కొనుగోలుశక్తి పునరుద్ధరణకు వారి నుండి బిగపట్టుకొన్న మొత్తం సొమ్మును తిరిగి వెంటనే చెల్లించాలని కోరుచున్నాము.

(3) విద్యావిధానంలో అవాంఛనీయ పరిణామములకు దారితీసిన నిర్బంధ రిటైరుమెంటు ఉత్తర్వులను, నేటివిటీ జి.ఓ. వెంటనే రద్దుచేయవలసింగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరుచున్నాము.

## పనిదినాలు - గంటలు పెంచటం విద్యాభివృద్ధికి ప్రబలాటంకం

### నరసంపేట విద్యాగోష్ఠిలో ప్రముఖుల ఉద్బోధ

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ వరంగల్ జిల్లా, నర్సంపేట సమితిశాఖ ఆధ్వర్యాన స్థానిక ఉన్నత పాఠశాలలో 2-1-77న విద్యాగోష్ఠి జయప్రదంగా జరిగింది. హనుమకొండనుండి, వరంగల్లునుండి రెండు స్పెషల్ బస్సులలో ప్రతినిధులు వచ్చి అత్యుత్సాహంతో సభాకార్యక్రమాలలో పాల్గొన్నారు. సమితిశాఖ ఉచిత భోజన వసతులమర్చి అన్నియేర్పాట్లు చేసింది.

శ్రీ పెండెం కట్టయ్య (జిల్లా కాంగ్రెసు కార్యదర్శి) జాతీయ పతాకావిష్కరణ, శ్రీ ఎ. వెంకటస్వామి (రాష్ట్ర యు. టి. యఫ్. ప్రధాన కార్యదర్శి) సంఘ పతాకం ఎగురవేయుటతో గోష్ఠి కార్యక్రమం ప్రారంభమయింది:

ఆ సందర్భాన జరిగిన సభకు శ్రీ జి. లక్ష్మయ్య(రాష్ట్ర సంఘ పుపాధ్యక్షులు) అధ్యక్షత వహించారు. ప్రారంభంలో శ్రీ పి రుక్కయ్య "మా తెలుగుతల్లికి" గేయాలాపన చేశారు. శ్రీ జి. మల్లయ్య(సమితి సంఘ అధ్యక్షులు) గోష్ఠికి విచ్చేసిన ప్రతినిధులకు స్వాగతం చెప్తూ, అతిథుల్ని పరిచయంచేసి సమావేశ లక్ష్యాన్ని వివరించారు.

## శ్రీ కాళోజీ ఉద్బోధ!

శ్రీ కాళోజీ నారాయణరావుగారు ప్రారంభోపన్యాసం చేస్తూ 'మానవ హక్కుల పత్రాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రజాస్వామ్యంలో ఉన్న మానవులంగా మన బాధ్యతలను, బ్రతుకు బాటల్ని గూర్చి ఆలోచించుకోవాలనీ, స్వేచ్ఛ లేనివారుగా ఉపాధ్యాయులుండి విద్యారంగంలో విపరీత విధానాల అమలు వల్ల తీవ్ర బాధలకు గురి అవుతున్నారని, విద్యాభివృద్ధికి ప్రబల ఆటంకాలు ఏర్పడుతున్నాయనీ, ప్రస్తుతక్లిష్టపరిస్థితుల్లోకూడా న్యాయం కోసం యింతమంది గుమికూడి చర్చించి మార్గం చూపటం మీ ఉద్యమానికి గర్వకారణమనీ, సమస్యా పరిష్కారానికి సమైక్యంగా కృషిచేయడానికి ముందుకు రావలసిందిగా ఉద్బోధించారు.

## నిరుద్యోగుల్ని పెంచటమే నేటి విద్య లక్ష్యం!

డా॥ విఠల్ (ప్రజా వైద్యశాల, సూర్యాపేట) మాట్లాడుతూ 'నేటి విద్యా లక్ష్యమే శూన్యంగా ఉన్నదనీ, విద్యాభ్యాసం పిమ్మట బ్రతుకు తెరువు చూపని విధానం అమలులో ఉన్నదనీ, ఫలితంగా నిరుద్యోగులు హనుమంతుడి వాలంలా పెరిగిపోతున్నారనీ, భావితరంలో నిరాశా నిస్పృహ లేర్పడుతున్నాయనీ, ఫలితంగా భవిష్యత్తు గాఢాంధకారముగా ఉన్నదనీ, ఆ కారుచీకట్లను చీల్చి దివ్యదీపాల్ని ఉపాధ్యాయులు వెలిగించాలనీ, కడుపారా పాలు త్రాగగోరే దూడకు అంతకంటె మించిపాలు నివ్వ సిద్ధపడే గోమాతలా ఉపాధ్యాయులు విద్యార్థికి విజ్ఞానాన్ని అందించాలని, దోపిడీ సమాజ రూపాన్ని వివరించి దానికి పరిష్కారానికి దారిజూపాలనీ ఉద్ఘాటించారు.

## పనిదినాలు,పనిగంటలు పెంచటం అనాలోచితచర్య

ఉపాధ్యాయ ఎం.యల్.సి శ్రీ యం. మాధవరావు గారు తమ సుదీర్ఘ ప్రసంగంలో విద్యారంగంలో జరుగుతున్న మార్పుల్ని వివరించి, మాటిమాటికీ విధానాలు మార్చటం ద్వారా విద్యార్థులు ప్రయోగశాలలో పరికరాలుగా మార్చబడినారనీ, ఫలితంగా పాతికేళ్ళుగా జాతికి తీవ్రనష్టం వాటిల్లిందనీ, కనీసం స్వతంత్ర పోరాట కాలంలో నినాదమిచ్చిన జాతీయ విద్యావిధానాన్నయినా అమలు జరుప లేకపోయారనీ, కోట్లాది ప్రజలు ఇంకా నిరక్షరాస్యతతో దారిద్ర్యంతో మగ్గిపోతున్నారనీ, జాతి ప్రయోజనాన్ని రక్షించే ఏ అంశాలూ ప్రస్తుత విద్యావిధానంలో లేవనీ, పులిమీద పుట్రలా విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి పెంచటమేగాక, అనాలోచితంగా పని గంటలు పనిదినాల్ని పెంచారనీ, దీనివలన మానసిక దారిద్ర్యం తప్ప ఫలితంలేదనీ, ఉదాహరణలతో వివరించారు.

## ఖేర్ కమిటీ సూచనల్ని అమలు చేయాలి!

ఐక్యోపాధ్యాయ ప్రధాన సంపాదకులు శ్రీ మైనేని వెంకటరత్నం ప్రసంగిస్తూ 'అస్తవ్యస్త విధానాలలో ఉపాధ్యాయుని బ్రతుకు దుర్భరమయిందనీ, అసలే సామాజిక గౌరవం లేని స్థితిలో అవమానకర ప్రకటనలతో మరింత కించపరచటం దారుణమనీ, తమ అశాస్త్రీయ విధానాల పాపభారాన్ని ఉపాధ్యాయులపైపెట్టి పాలకులు తప్పుకుంటున్నారనీ. ఖేర్‌కమిటీ సూచనల మేరకైనా విద్యాపద్దుకు బడ్జెట్‌లో 10 శాతం కేటాయింపవలసి యుండగా కేవలం 3.9 శాతానికి కోత పెట్టబడిందనీ, వర్ధమాన దేశాలని చెప్పబడే ఆగ్నేయాసియా దేశాలు. విద్యకు మొత్తం బడ్జెట్‌లో తగినంతపద్దు కేటాయిస్తున్నాయనీ గొప్పలు చెప్పుకునే మన దేశంలో నిరక్షరాస్యత నిర్మూలన యెడ నిర్లక్ష్యం చూపబడటమేగాక, పునాదివిద్యయైన ప్రాథమిక విద్యయెడ సవతితల్లి ప్రేమ చూపబడుతున్నదనీ, ఉపాధ్యాయ ఉద్యమం నూతన జాతీయ విద్యా విధానానికి పోరాడాలనీ, ఉపాధ్యాయునికి ఆర్థిక సామాజిక గౌరవం పెంచటం ద్వారా మాత్రమే దేశప్రగతి సాధింపబడగలదనీ' వివరించారు.

## 8, 9, 10 తరగతులకుకూడా పనిగంటల్ని పనిదినాల్ని తగ్గించాలి!

శ్రీ ఎ. వెంకటస్వామి(రాష్ట్ర యు. టి. యఫ్. ప్రధాన కార్యదర్శి)గారు మాట్లాడుతూ ఐక్యోద్యమ నిర్మాణ ప్రాముఖ్యత, ఉద్యమ చరిత్ర వివరించి డిశంబరు 15న విద్యామంత్రితో జె.సి.టి.ఎ. సాగించిన చర్చలూ, 7వ తరగతివరకు పనిగంటల పనిదినాల పెంపుదల రద్దుగావింపబడటం మనపాక్షిక విజయమనీ, 8, 9, 10 తరగతుల విషయంలో కూడా దాన్ని సాధించాలని తెలిపారు.

శ్రీ పెండెం కట్టయ్య గారు మాట్లాడుతూ 'విద్యారంగంలో లోపాలుచర్చించి శాస్త్రీయపద్ధతిలో విద్యావిధానం అమలు జరిపించటం నేటి కర్తవ్యమనీ, దానికి మీ ఉద్యమం ప్రశంసనీయ కృషి చేస్తున్నదని చెప్పి అభినందించారు.

వరంగల్ జిల్లాశాఖ అధ్యక్షులు శ్రీ యం. భూమయ్యగారు. స్థానిక ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టారు శ్రీ సత్యనారాయణగారు మాట్లాడిన పిదప అధ్యక్షులు గోష్ఠిని సమీక్షిస్తూ 'పెరిగిన పనిగంటలు, పని దినాలు' అశాస్త్రీయంగా స్థానిక భౌగోళిక తదితర వనరులను దృష్టిలోనుంచుకోకుండా బలవంతంగా విద్యావిధానంలో చొప్పించడం సరిపడని వ్యవహారమనీ, శాస్త్రీయ అవగాహనతో విద్యావిధానంలో గల లోపాన్ని సవరించి సరియైనరీతిగా అమలు పరచాలని గోష్ఠి అభిప్రాయ పడుతున్నదని నుడివిరి.

## ప్రతినిధుల సమావేశం

మధ్యాహ్నం శ్రీ జి. మల్లయ్యగారి అధ్యక్షతన ప్రతినిధుల సభ జరిగింది. అందులో ఉద్యమ నిర్మాణం, పత్రిక విషయాలపై శ్రీ మైనేని, వెంకటస్వామిగార్లు వివరణలిచ్చారు. శ్రీ కె. భద్రయ్య (జిల్లాశాఖ కార్యదర్శి) జిల్లా రిపోర్టు ఇచ్చి మరింత సంఘటితంగా ఉద్యమం పురోగమించాల్సిన అవసరాన్ని స్పష్టపరిచారు. తర్వాత శ్రీ యం వెంకటరెడ్డి (ఉపాధ్యక్షులు నర్సంపేట సమితి) గారు వివిధ సమస్యలకు చెందిన మొత్తం 41 తీర్మానాలను సభ ముందుంచి ఆమోదం పొందేరు. సమితి శాఖ ప్రధానకార్యదర్శి శ్రీ యం. సుందరయ్య కృతజ్ఞతాభివందనాలతో సభ జయప్రదంగా ముగిసింది.

---

## తిరుపతిపట్టణంలో శ్రీ మాధవరావుగారి పర్యటన

డిశంబరు 19, 20 తేదీలలో శ్రీ యం. మాధవరావు (యమ్.యల్.సి) గారు శ్రీయుతులు మైనేని వెంకటరత్నం, శ్రీ కె. వెంకటేశ్వర్లు, శ్రీ జి. ప్రభాకర్‌గార్లతో కలిసి పట్టణంలోని వివిధ విద్యాలయాల్ని సందర్శించి ఉద్యమ నిర్మాణాన్ని ప్రబోధించి సమస్యల్ని సేకరించటం జరిగింది.

## సం॥కు 200 రోజులు, వారానికి 5 రోజులు, రోజుకు 5 గంటలు

# వెంటనే అమలు జరపాలి

జె. సి. టి. ఎ పక్షాన జనవరి 23వ తేదీన విజయవాడలో 'శాశాని గెస్ట్ హౌస్' వంతు రాష్ట్రస్థాయి విద్యాసదస్సు జరిగింది. ఆ సదస్సుకు శ్రీ యం. జె. మాణిక్యాలరావు అధ్యక్షత వహించారు. 11 ఉపాధ్యాయ సంఘాలూ, 8 మంది శాసన మండలి సభ్యులతో ఏర్పాటైన జె. సి. టి. ఎ పక్షాన జరిగిన యీ సదస్సుకు కృష్ణా, గుంటూరు, ఖమ్మం మొదలైన జిల్లాల నుండి వందలాది ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశం హాలు కిక్కిరిసి పోయి జనం చాలామంది బయట ఉండిపోవటం జరిగింది.

శ్రీ యం. జె. యం (అధ్యక్షులు) మాట్లాడుతూ పని గంటలు బడిదినాల పెంపుదల అశాస్త్రీయమనీ, వెంటనే హైస్కూళ్ళలోని 8, 9 10 తరగతులకు కూడా తగ్గించి, ప్రక్క రాష్ట్రాలమేరకైనా పనిగంటలు బడి దినాలు నిర్ణయించాలని, ప్రభుత్వం యిచ్చిన హామీ ప్రకారం వెంటనే జె.సి.టి.ఎతో చర్చలు జరిపి పని గంటల, బడిదినాల తగ్గింపుకు తగు చర్యలు గైకొనాలని కోరారు.

ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ. వెంకటస్వామి మాట్లాడుతూ పరీక్షాఫలితాలు తగ్గిపోయాయనే సాకుతో ప్రభుత్వం పనిగంటలు బడిదినాలు పెంచిందని వాస్తవానికి 1965 నుండి 75 వరకు మోడరేషన్ మార్కులు కలిపి పరీక్షాఫలితాలు నిర్ణయించారని, 76లో మోడరేషన్ తొలగించి నిర్ణయించారనీ, మోడరేషన్ 76లో కలిపిచూస్తే గతపదిసంవత్సరాలకంటె 76 సంవత్సరం ఫలితాలు ఏమీపడిపోలేదని... ఆ విషయమే శాసనమండలిలో మన ప్రతినిధులు నిలదీయటం జరిగిందనీ అన్నారు. గత విద్యా సంవత్సరం పాఠశాలల్లో ప్రశాంత వాతావరణం వున్నదని కొందరంటున్నారని, కాని పైకి ప్రశాంతంగా కన్పించినా ఉపాధ్యాయులు విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమయ్యారని, నేటి విటీ ఉత్తర్వు నిర్బంధ రిటైర్‌మెంట్ ఉత్తర్వులు వారిని కల్లోల పరిచాయని, అలాగే విద్యార్థులకు రోజుకొకటిగావున్న పరీక్షల్ని పూట కొకటిగామార్చి, 7వ తరగతికి మార్కులు అకస్మాత్తుగాపెంచి పాఠశాలల్లో గందరగోళస్థితిని కల్పించారని, ఈకల్లోల పరిస్థితి నుండి ఉపాధ్యాయులకు రక్షణ కల్పించటానికి యు టి యఫ్. చరిత్రాత్మక పాత్రనిర్వహించిందనీ, భవిష్యత్తులోకూడా జె సి. టి. ఎ. కార్యక్రమాల అమలులో తనవంతు కర్తవ్యం నిర్వహిస్తుందని చెప్పేరు.

ఇంకా ఆ సమావేశంలో శ్రీయుతులు వి. శ్యామసుందరరావు, వి శ్రీరామమూర్తి, డి సత్యనారాయణరాజు, సింగరాజు, పిల్లా వెంకటేశ్వరరావు, యార్లగడ్డ రాజగోపాలరావు కొండేశ్వరరావు మొదలగు సంఘాలనాయకులు శాసనమండలి సభ్యులైన శ్రీ కొల్లూరి కోటేశ్వరరావు, మార్పు బాలకృష్ణమ్మ దండు శివరామరాజు ఇంకా అనేకులు మాట్లాడిరి.

పిదప శ్రీ యల్. సుందరం గారు క్రింది తీర్మానాలు ప్రవేశ పెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించటం జరిగింది.

పాఠశాలపనిదినాలకు సం॥నకు 200 రోజులు, వారానికి 5 రోజులు, రోజుకు 5 గంటలు వుండాలి.

ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి ప్రాథమిక స్థాయిలో 1 : 20 వుండాలి. సెకండరీ స్థాయిలో 1 : 30 వుండాలి,

చివరికి శ్రీ పిళ్ళా వెంకటేశ్వరరావుగారివందన సమర్పణతో సభ జయప్రదంగా ముగిసింది.

## జె. సి. టి. ఎ. కార్యక్రమం

ఆ తర్వాత జె. సి. టి. ఎ. కార్యవర్గం సమావేశమై పనిగంటల బడిదినాల తగ్గింపుపై యీ క్రింది కార్యక్రమాం తీసుకొన్నది.

1. ఫిబ్రవరి 1 నుండి 7 వరకు ప్రతి పాఠశాల నుండి ప్రభుత్వానికి టెలిగ్రాము లివ్వాలని (2) 8 నుండి 14 వరకు ప్రతి ఉపాధ్యాయుడు ప్రభుత్వానికి కార్డులు పోస్టు చేయాలని నిర్ణయించింది. $1\frac{1}{2}$ లక్షల మంది ఉపాధ్యాయులు ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేసింది.

# చిత్తూరు జిల్లా యు.టి.యఫ్ శాఖ నిర్మాణం

చిత్తూరు జిల్లా వివిధ ప్రాంతాలకు చెందిన యు.టి.యఫ్ కార్యకర్తలు 6-2-77 న తిరుపతి, ప్రకాశం మునిసిపల్ హైస్కూల్లో శ్రీ కె. నారాయణరావు (రాష్ట్రసంఘాధ్యక్షులు) గారి అధ్యక్షతన సమావేశమయ్యారు. తొలుత శ్రీ యమ్. మాధవరావు (యమ్ యల్.సి) గారు సందేశమిస్తూ "శాసన మండలి సభ్యులొక్కరే ఏమీ చేయలేరని, బయట కూడా ఉపాధ్యాయులు పటిష్టమైన సంఘనిర్మాణం ద్వారా సమస్యా పరిష్కారానికి కృషిచేస్తే శాసనమండలిలో దానిని తాను ప్రతిధ్వనింపజేయగలనని, అందుకు యు టి యఫ్ వెనుక ఉపాధ్యాయులంతా సమీకృతులు గావాలని, శాఖోపశాఖలుగా జిల్లా అంతటా ఉద్యమాన్ని విస్తరింపజేయాలని, ప్రబోధించి దానికి తీవ్ర కృషి సాగిస్తున్న కార్యకర్తల్ని అభినందించారు. పిదప శ్రీ కె తిరుపాలు (రాష్ట్ర సంఘ కార్యదర్శి) ఉద్యమ రిపోర్టు ఇచ్చారు.

ఆ తరువాత జిల్లాలో వివిధ మేనేజిమెంట్లలో ఉపాధ్యాయులెదుర్కొంటున్న సమస్యలపై కార్యకర్తలు సునిశిత చర్చలు సాగించి, ఆయా అధికారులతో రాయబారాలు సాగించాలని, సమస్యా పరిష్కారానికి తీవ్రకృషి చేయాలని కార్యక్రమం తీసుకొన్నారు. జిల్లాశాఖ తరఫున జే.సి.టి.ఎ కార్యక్రమాన్ని జయప్రదం చేయటానికి 2 వేల కార్డులు అచ్చువేయించి వివిధ విద్యాలయాలకు పంపిణీచేయటం జరిగింది. పిదప యీ క్రింది తాత్కాలిక కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది.

అధ్యక్షులుగా శ్రీ యం. కృష్ణంనాయుడు, ఉపాధ్యక్షులుగా శ్రీమతి యమ్. పుష్పానాయుడు, శ్రీ యమ్. అర్జున రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీ సి. మహాదేవరెడ్డి, కార్యదర్శులుగా శ్రీ పి. నరసింహరాజు, శ్రీ కె. వెంకటేశ్వరు, కార్యవర్గ సభ్యులుగా శ్రీయుతులు పి ఆర్. జి. ప్రసాద్, కోటేశ్వరరావు, జి. మునిరత్నంనాయుడు, వి. చెంగలరెడ్డి,

పి. వెలనాటి మునిరెడ్డి, సి. ఆనందనాయుడు, డబ్ల్యు. కేశవుల నాయుడు, యమ్. కృష్ణారెడ్డి, టి. వెంకట్రామిరెడ్డి, యన్. సుబ్బారెడ్డి, కె. రాజరత్నం, ఆర్. కుమారస్వామి రెడ్డి, టి. రాధాకృష్ణ, టి. కృష్ణంనాయుడు, వై వెంకటరమణారెడ్డి, కె సి రాజశేఖర్, సి జయరామిరెడ్డి వివిధ ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తూ ఎన్నుకోబడినారు.

విదప వసిగంటలు పనిదినాలు 8,9,10 తరగతులకుకూడా వెంటనే తగ్గించాలని, నేటి చిటీ సూత్రం రద్దుచేయాలని, నిర్బంధ డిపాజిట్ స్కీము రద్దుచేయాలని, బి. యి. డి. లకు సెలక్షన్ గ్రేడ్ వెంటనే అమలుజరపాలని, మునిసిపాలిటీలలో 1964, 1970 పంచాయితీ ఎన్నికలకు చెందిన ఎరెండ్‌లీవు క్రెడిట్ చేయాలని, ఉపాధ్యాయులకు ఇళ్ళస్థలాల కేటాయింపు జరగాలని, 1973 వేసవిలో పనిచేసిన కాలానికి ఎరెండ్‌లీవు క్రెడిట్ చేయాలని, కుటుంబనియంత్రణ విషయంలో ఉపాధ్యాయులపై నిర్బంధాల్ని చేయరాదని, హెడ్‌మాష్టర్ల మనాన్ వెకేషన్ డిపార్టుమెంటుగా పరిగణించాలని, ఎయిడెడ్ మేనేజిమెంట్లపై ప్రభుత్వం పవతితల్లి విధానాన్ని విరమించాలని, కుటుంబ సంక్షేమ పథకాన్ని ఎయిడెడ్ టీచర్లకుకూడా వర్తింప జేయాలని వివిధ తీర్మానాలు ఆమోదించారు.

## చిత్తూరుజిల్లాలో యు. టి. యఫ్ జైత్రయాత్ర ఉద్యమ నిర్మాణంలో ఉపాధ్యాయుల సహకారం

డిశంబరు 19వ తేదీ నుండి 29 తేదీ వరకు జిల్లాలో యు.టి యఫ్ నాయకులు శ్రీ యుతులు మైనేని వెంకటరత్నం (ఐక్య ఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు) ఎ వెంకటస్వామి (రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి) డి. రామిరెడ్డి, (రాష్ట్ర సంఘ కార్యదర్శి) అధ్వర్యాన శ్రీ మహాదేవరెడ్డి, శ్రీ పి. వెంకటేశ్వర్లు శ్రీ అర్జునరెడ్డి, శ్రీ కె. వెంకటేశ్వర్లు శ్రీ జి. ప్రభాకర్ శ్రీ గురుమూర్తి శ్రీ సుబ్బారెడ్డి శ్రీ జి. నాగభూషణం శ్రీమతి టి.మంగరాజమ్మగార్లు దళాలుగా బయలుదేరి తిరుపతి. మదనపల్లి పట్టణాల్ని చంద్రగిరి తాలూకా, పుత్తూరుతాలూకా, పుంగనూరు తాలూకా, చిత్తూరు తాలూకా, వాయిలపాడు తాలూకా మదనపల్లి తాలూకాలలోగల వివిధ విద్యాలయాల్ని సందర్శించి ఉద్యమావసరాన్ని వివరిస్తూ సమస్యల్ని సేకరించడం జరిగింది. ఫలితంగా వేలాది ఉపాధ్యాయులు యు టి యఫ్ సభ్యత్వం స్వీకరించటం, పత్రిక చందాలు చెల్లించటమేగాక జిల్లాలో పటిష్టసంఘ నిర్మాణానికి తమ సంసిద్ధతను తెల్పి, హృదయపూర్వక సహకారాన్నందించారు. జిల్లా పరిషత్తులో పేరుకొన్న వివిధసమస్యల పరిష్కారానికి ఉద్యమమేశరణ్యమని గుర్తించారు

## తిరుపతి పట్టణ తాత్కాలిక కన్వీనింగ్ బాడీ ఎన్నిక:

పట్టణ యు టి. ఎఫ్. కార్యకర్తలు 26-1-77న టి టి డి. ఎంప్లాయీస్ అసోసియేషన్ హాలులో సమావేశమై తాత్కాలిక కన్వీనింగ్ బాడీని ఎన్నుకొన్నారు. ఆ సందర్భంలో జరిగిన సమావేశానికి శ్రీ పి. యన్. నారాయణస్వామిగారు అధ్యక్షత వహించారు. పట్టణసంఘానికి అధ్యక్షులుగా శ్రీ కె.వరుశురామ పిళ్ళె, ఉపాధ్యక్షులుగా యమ్. భాస్కరరెడ్డి, శ్రీ కె. వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శిగా శ్రీజి.ప్రభాకర్ కార్యదర్శులుగా శ్రీ యన్. సుదర్శరెట్టి, శ్రీ వి. సేతు మాధవరావు కార్యవర్గ సభ్యులుగా మరి ఐదుగురు వివిధ విద్యాలయాల నుండి ఎన్నికయ్యారు.

## పట్టణ అధికారులతో రాయబారాలు

శ్రీ యం మాధవరావు పట్టణ కార్యకర్తలతో కలిసి డిశంబరు 19న దేవస్థానం డి.యి ఓ గారితోను, 20న పట్టణ మునిసిపల్ ప్రత్యేకాధికారి మరియు కమీషనర్‌గారితోను వివిధ సమస్యలపై రాయబారం జరిపేరు. రిటైరైన వారి విషయంలో ఇతర మేనేజిమెంట్లలోని సర్వీసుకుకూడా కలిపి పెనన్ నిర్ణయించాలని సి ఐ టి డి విద్యాధికారిగార్ని కోరేరు. అట్లే 1) 1973లో వేసవిలో 10వ తరగతి నడిపిన వారందరికి 37 రోజులు ఎరండ్‌లీవు క్రెడిట్‌చేయాలని 2) 1964-70 లలో ఎన్నికల సందర్భంలో స్టేషన్ విడిచి పెట్టరాదనే జి.ఓ నను సరించి అందరికి ఎరండ్‌లీవు క్రెడిట్‌చేయాలని 3) మునిసిపల్ ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ పాఠశాలలకు డైరెక్టు చెక్కు లివ్వాలని 4) జి ఓ ననుసరించి సీనియర్ల ఇంక్రిమెంట్ తేదీలను జూనియర్ ఇంక్రిమెంట్ తేదీలకు మార్చాలని 5) రిటైరైన టీచర్ల ఖాళీలు భర్తీ చేయాలని 6) ఫేమిలి బెనిఫిట్ స్కీము, మరణించినవారి కర్మకాండలకు గ్రాంటు అమలు వరచాలని 7) మునిసిపల్ టీచర్లకు ఇండ్ల స్థలాలు ఇప్పించాలని 8) జూనియర్ కాలేజి స్థాపించే ప్రపోజల్ ఆచరణలోకి తేవాలని 9) పి యఫ్. స్లిప్పులు ఇప్పించాలని కమీషనర్‌గార్కి విజ్ఞప్తి చేశారు. ఆ సమస్యల మెమొరాండాన్ని పట్టణశాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ జి. ప్రభాకర్ 27-1-77 న కమీషనర్‌గారికి సమర్పించారు. కమీషనర్‌గారు 8-2-77న కోఆర్డినేషన్ సమావేశం జరుపుతానని, సమస్యల పరిష్కరించటానికి చర్యలు తీసుకుంటానని హామీ యిచ్చారు.

## సమన్వయ సమావేశాలు

వెల్లూరు జిల్లా:- జిల్లా కోఆర్డినేషన్ సమావేశం శ్రీ కలెక్టర్‌గారి అధ్యక్షతన జిల్లాపరిషత్ హాలులో 12-1-77న జరిగింది, అధికారుల పక్షాన డి, యి. ఓ, జడ్, పి, సెక్రటరీ, పరిషత్ విద్యాశాఖాధికారిగార్లు హాజరయ్యారు. యు.టి.యఫ్. పక్షానశ్రీయుతులు జె రామచంద్రయ్య, పోతురాజు, కొండాచారి, తిరిపాలు, మాధవరావు, (యం. యల్. సి )గార్లు హాజరయ్యారు. సంఘ పక్షాన 3-1-77న కలెక్టర్ గార్కి ఇచ్చిన సమస్యలపైచర్చలుజరిగి యీ క్రిందినిర్ణయాలు తీసుకోబడినవి.

1. సి. డిమొదటి వాయిదా 12-1-77 లోగా చెల్లిస్తామన్నారు. వాగ్దానం ప్రకారం చెల్లించబడినది (2)ప్యానల్‌కు పిలువబడిన ఇన్ సర్వీసు టీచర్ల సర్వీసులను రెగ్యులరైజ్ చేసే విషయంలో, ప్యానల్ లిస్టులు తయారు చేయబడ్డాయనీ, నెలాఖరులోగా అటెస్టేషన్ ఫారాలు పంపుతామని, యాంటిసిడెన్సీ వెరిఫికేషన్ అనంతరం రెగ్యులరైజ్ చేస్తామన్నారు. (3)శిక్షణకు పంపబడిన పండితుల వేతనాలుచెల్లింపువిషయంలో ప్రభుత్వానికి క్లారిఫికేషన్ వ్రాశామనీ, జవాబు రాగానే మళ్ళీ డి. ఓ. లెటర్ పెడతామన్నారు. అలాగే ట్రైనింగుకాని

పండితుల రీఫిక్సేషన్ విషయం ప్రభుత్వానికి వ్రాశామని, జవాబురాగానే నిర్ణయిస్తామన్నారు. (4) సెలక్షన్ గ్రేడును జనవరి నెలాఖరులోగా అమలు జరుపుతామన్నారు. (5) హెడ్మాష్టర్ల డ్యూటీ అలవెన్సు స్పెషల్ పే గా గుర్తించి ఎ. డి ఎ యిచ్చే విషయం యీ నెలాఖరులోగా పరిష్కరిస్తామన్నారు. (6) సీనియర్ల కంటె జూనియర్ల యింక్రిమెంటు తేదీ ముందు వచ్చినపుడు అట్టివారికి జూనియర్ ఇంక్రిమెంట్ తేదీ అమలు జరపటాన్ని 20-2-77లోగా అమలుచేస్తామన్నారు. 7)బదిలీలబిల్లులు వెంటనేతయారుచేసి,ప్రభుత్వంనుండిస్పెషల్ గ్రాంటు తెప్పించిగాని, విద్యానిధినుండి మంజూరు చేయించి గాని టిటిఎ బిల్లులు చెల్లిస్తామన్నారు. (8) ఉపాధ్యాయులకు వర్తించు ప్రభుత్వ ఉత్తర్వువచ్చిన వెంటనే వేసవి మాయింక్రిమెంట్లు మంజూరు చేస్తామన్నారు. (9) 8, 9, 10 తరగతుల బోధనకువెళ్ళు గ్రేడు II పండితులకు రు 10/- అలవెన్సు వెంటనే యిస్తామన్నారు. (10) 75-76 పి యఫ్ స్లిప్పులుఫిబ్రవరి నెలాఖరులోగా 76-77 స్లిప్పులు మే నెలాఖరులోగా ఇస్తామన్నారు (11)పియఫ్ నిధులనుండి ఋణాలిచ్చుటలోఅవసరపరిస్థితిని బట్టి నిబంధనల్ని సడలిస్తామన్నారు. (12) మొదటివాయిదా కట్టిన యల్ ఐ సి ని పి యఫ్ స్కీములో చేర్పుతామన్నారు. (13) తెలంగాణానుండి వచ్చిన ముగ్గురి 50% డి ఏ తెప్పించి పియఫ్‌లో జమచేశామనీ, ఇంకా కల్గురికి రావలసివున్నదనీ, త్వరలో తెప్పించి జమచేస్తామన్నారు.

14 1968 సెక్యూరిటీ డిపాజిట్ వెంటనే చెల్లిస్తామన్నారు. 15) శ్రీ వి. లాజరస్ (గూడూరు) శ్రీ వి. రామమోహన గార్ల ఫిక్సేషన్ను ప్రభుత్వంనుండి వివరణరాగానే పూర్తిచేస్తామన్నారు. 16) సమితులలో సమన్వయ సమావేశాలు జరపవలసినదిగా బి డి. ఓలకు వ్రాస్తామన్నారు.

చర్చలు సుహృద్భావ వాతావరణంలో జరిగాయి. తీర్మానాలు రికార్డుచేయబడ్డాయి మినిట్సు హాజరైన వారందరికి పంపబడినవి.

జిల్లాశాఖ కృషిఫలితంగా తెలుగు పండితులకు ఇంక్రిమెంట్లు ఇప్పించడం,డెప్యుటేషన్ సాధించటం,శిక్షణకాలంలో జీతాలు ఇప్పించే కృషిచేయటం, మూడు జి. ఓలు మార్పించి ప్యానల్ చేయించటం జరిగింది.

అన్ ట్రయిన్‌డ్ తెలుగు పండితులను శిక్షణకు పంపించి పూర్తి వేతనం చెల్లించాలని వారిలో 10 సం॥లు సర్వీసుగల వారుకూడా ఉన్నారని; శిక్షణకు పోయిన వారిఖాళీలను భర్తీ చేయకుండా ఉండాలనీ, అట్టివార్కి గతంలో శిక్షణ పొందిన వార్కి పూర్తి జీతాలివ్వాలని జిల్లాశాఖ డిమాండ్ చేస్తున్నది.

జె. సి. టి. ఎ. :- రాష్ట్ర జె. సి. టి, ఎ. నిర్ణయం ప్రకారం 9-1-77న నెల్లూరులో జరిగిన జిల్లా జెసిటిఎ కు రాష్ట్ర యు టి యఫ్ కార్యదర్శిశ్రీ కె. తిరుపాలు కన్వీనర్‌గా ఎన్నుకొన్నారు. సంవత్సరానికి పనిదినాలు 200గాను,వారానికి 5 రోజులుగాను, రోజుకు 5 గంటలుగాను నిర్ణయించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఆ సమావేశంలో తీర్మానింపబడింది. జెసిటిఎ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయవలసిందిగా జిల్లాలోని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేయబడింది.

పిఠాపురం సమితి : 25-1-77న పిఠాపురం సమితి స్పెషల్ఆఫీసరువారి అధ్యక్షతన సమన్వయ సమావేశంజరిగింది. యు టి.యఫ్ తరపున శ్రీ వి, సూర్యనారాయణరాజు, శ్రీ జి. నాగేశ్వరరావుగార్లు హాజరయ్యారు. శ్రీ యమ్ అప్పారావు 1964 ఎన్నికల కలవు, శ్రీ యల్. సోమరాజు ఖాళీ 50%డి ఎ, మిగిలిపోయిన ఫిక్సేషనులు, సర్వీసు రెగ్యులరైజేషన్స్, పాఠశాలలకు పరికరాలు మొదలగు 20 అంశాలపై సమర్పించిన వినతి పత్రంపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. శ్రీ బి డి ఓ సావధానంగా విని అన్ని సమస్యల్ని సత్వరం పరిష్కరింపగలమని హామీ యిచ్చారు.

ప్రకాశంజిల్లా శాఖ :- ప్రకాశం జిల్లాపరిషత్ సమన్వయ సమావేశం 24-1-77న జరిగింది. యు. టి. యఫ్ పక్షాన శ్రీ డి.రామిరెడ్డి శ్రీ టి.బాలకృష్ణమూర్తి పాల్గొన్నారు. ట్రైనింగుకు వెళ్ళిన పండితులకు జీతాలివ్వాలని, 30 రోజుల లోపు ఎరెండులీవు మంజూరుచేయు అధికారం హెడ్మాష్టర్ కివ్వాలని, ప్రధానోపాధ్యాయుల డ్యూటీ అలవెన్సుకు డి. ఎ ఇవ్వాలని మూడు ముఖ్య నిర్ణయాలు జరిగేయి. మిగిలిన సమస్యలపై అస్పష్ట నిర్ణయాలు జరిగినందున ఆందోళన అవసరమని అంతా అభిప్రాయపడ్డారు. సెకండరీ గ్రేడ్ పొందుటకు మేగ్నిమం చేరనక్కరలేదని ప్రభుత్వ ఉత్తర్వువచ్చినదృష్ట్యా సీనియర్ లిస్టులో తగుమార్పులు చేయాల్సివుంటుంది. పి.యఫ్ స్లిప్పులు మార్చిలోపల ఇస్తామన్నారు. ఇంకా 15 సమస్యలపై చర్చలు జరిగినవి,

## శాఖా సమావేశాలు

బుచ్చిరెడ్డిపాలెం సమితిశాఖ:—26-12-76న నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డిపాలెం సమితి శాఖ కార్యవర్గ విస్తృత సమావేశం శ్రీ యస్. ఐ. కాశేషాగారి అధ్యక్షతన జరిగింది. ప్రధాన కార్యదర్శి శ్రీ జాజుల రామచంద్రయ్య కృషి నివేదిక ప్రవేశ పెట్టారు. ప్రాథమిక, పున్నత పాఠశాలల నుండి 240 మంది హాజరయ్యారు. రాష్ట్రసంఘ కార్యదర్శి కటారితిరుపాలు జిల్లాశాఖ అధ్యక్షుడు శ్రీ యం. పోతురాజు సమావేశానికి హాజరై సందేశాలిచ్చారు. శ్రీయుతులు ఎ. జోసఫ్, టి. యానాదయ్య చర్చల్లో పాల్గొని ఉద్యమాభివృద్ధికి తమ సూచనలు చేశారు, పిదప టి టి ఎ లను సి డి లో రేవంతు మొత్తాన్ని వెంటనే చెల్లించాలని, ట్రయినింగు గాని భాషా పండితులను జీతంమీద డెప్యుటేషన్ పంపాలనీ డి ఇ ఓ గారు ప్రకటించాలని సెలక్షన్ గ్రేడ్ పోస్టులకు వారి పేర్లతో ప్రకటించాలని వివిధ తీర్మానాలు ఆమోదించారు,

తూర్పుగోదావరిజిల్లా శాఖ :- జిల్లాకార్యవర్గ విస్తృత సమావేశం 26-12-76న రాజమండ్రిలో శ్రీ పి వి ముత్తారావు గారి అధ్యక్షతన జరిగింది. జిల్లాలోని 20 సమితులు, 4 పట్టణ శాఖలకు చెందిన ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. జిల్లానివేదికను ప్రధానకార్యదర్శి శ్రీ వి సూర్యనారాయణరాజు ప్రవేశపెట్టారు. దానిపై చర్చలో 50మంది పాల్గొన్నారు. పిదప

దక్షిణాది రాష్ట్రాలవలె పనిగంటలు, బడిదినాలు నిర్ణయించి వెంటనే ఉత్తర్వులివ్వాలని, ఆర్ట్సు మరియు క్రాఫ్ట్సు టీచర్లకు కనీస విద్యార్హతలు యస్‌యస్‌సి ఉండవలెననెడి ఉత్తర్వు ఉపసంహరించుకోవాలని, పెదపూడి గాంధీ మెమోరియల్ హైస్కూలు ఉపాధ్యాయుల 69 సంవత్సరము పేఫిక్సేషన్ ఏరియర్సు, అక్టోబరు, నవంబరు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని, 5 వంతు సిడిసొమ్ము వడ్డీతోసహా పూర్తిగా చెల్లించాలని, రాజమండ్రి డివిజన్‌లో బ్రాంచి పోస్టుమాస్టర్లుగా పని చేస్తున్న సమితి ఉపాధ్యాయులను వారి పూర్వస్థానాలకు బదిలీలు చేయాలని, సీనియారిటీని పరిగణనలోనికి తీసుకొని ప్రధానోపాధ్యాయులుగా ప్రమోట్ చేయాలని వివిధ తీర్మానాలు ఆమోదించారు.

కపిలేశ్వరపురం సమితిశాఖ :–12-12-76న కపిలేశ్వరపురంసమితిశాఖ తరపున శ్రీ యమ్. సూర్యనారాయణ, శ్రీ యు. సత్యనారాయణగార్లు సమితి ఆఫీసుకు వచ్చిన సబ్‌కలెక్టర్‌గార్ని కలిసికొని, 429 నెంబరు జి. ఓ. నిబంధనలకు వ్యతిరేకంగా జరిగిన అక్రమ బదిలీలను వివరించారు. దానిపై ఆయన ఆ సమస్యల్ని సత్వరమే పరిష్కరిస్తానని హామీ యిచ్చారు.

3-12-76 న జడ్. పి. శక్రటరీ గారిని కలిసికొని అక్రమ బదిలీల విషయంచెప్పి 6 అంశాలుగల మెమోరాండం సమితి శాఖ తరపున ఇవ్వటమైనది. ఆ రాయబార వర్గంలో సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీ యల్. చిన్నబ్బాయి, శ్రీ సి. హెచ్. సత్యనారాయణ, శ్రీ హెచ్. సత్యనారాయణ, శ్రీ వి. యస్. కాశీవిశ్వేశ్వరరావు, శ్రీ యమ్. సూర్యనారాయణగార్లు పాల్గొన్నారు.

పి. గన్నవరం సమితిశాఖ : 21-11-76 న మొగలికుదురు పరిషత్ హైస్కూలులో శ్రీ కె.వి.వి. కోటేశ్వరరావుగారి అధ్యక్షతన ఉపాధ్యాయ సంఘాల సంయుక్త సమావేశం జరిగింది. వివిధ సంఘాల ప్రతినిధులతో ఐక్యకార్యాచరణ కమిటీ ఏర్పడి శ్రీ కె వి వి కోటేశ్వరరావుగారిని కన్వీనర్‌గా ఎన్నుకొన్నది.

కావలి పట్టణ శాఖ : 19-12-76 న నెల్లూరు జిల్లా కావలిలో యు టి యఫ్ కార్యకర్తలు జిల్లా కార్యవర్గసభ్యులగు శ్రీ ఎం. వెంకటరామయ్య అధ్యక్షతన సమావేశమయ్యారు. యు టి యఫ్ ఆశయాలను శ్రీ వెంకటరామయ్య వివరించారు. పట్టణశాఖ అధ్యక్షులుగా శ్రీ వి. వెంకయ్య ఉపాధ్యక్షులుగా శ్రీ జె. బెంజిమెన్ కార్యదర్శిగా శ్రీ యు. వి. రామరాజు సహాయకార్యదర్శులుగా శ్రీయుతులు వి. హనుమయ్య, ఖాజావలిగారు ఎన్నుకోబడిరి. ఆ సందర్భంలో కె.వి.సుబ్బయ్యగారు యు.టి.యఫ్ కార్యక్రమాన్ని వివరించారు. శ్రీ వి.హనుమయ్య వందన సమర్పణ చేశారు.

నల్లజర్ల సమితిశాఖ :- ప.గో.జిల్లా,నల్లజర్ల సమితి యు. టి. యఫ్ కార్యకర్తల సమావేశం 30-1-77న కాదేవల్లి గూడెంలో శ్రీ జె. బసవలింగంగారి అధ్యక్షతన జరిగింది. దానికి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ పోలిసెట్టి హాజరై సందేశమిచ్చారు. కార్యకర్తల రిపోర్టులవలన ఆ రోజుకు 137సభ్యత్వం పూర్తయినట్లు తెలిసింది. ఆ సంఖ్యను 200కు పెంచటానికి కార్యకర్తలు కార్యక్రమం తీసుకొన్నారు. పిదప శ్రీ జె. బసవలింగం అధ్యక్షులుగా,శ్రీ ఎ. వెంకటేశ్వరరావు, శ్రీ కె.లాజరస్ ఉపాధ్యక్షులుగా, శ్రీ సి.హెచ్. సుభాన్ చంద్రబోసు ప్రధాన కార్యదర్శిగా, శ్రీ యన్. వెంకట్రావు, శ్రీ వి. భాస్కరరావు కార్యదర్శులుగా మరి 5 గురితో కమిటీ ఎన్నికయింది.

పెరవలి సమితి :- ప. గో. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ పోలిశెట్టి పెరవలి సమితిలోని కానూరు, పెరవలి, ముక్కామల, ఖండవల్లి సెంటర్లలోని వివిధ పాఠశాలలను దర్శించి యు. టి. యఫ్ విశిష్టతను వివరించారు. ఫలితంగా అనేకులు సభ్యులుగా చేరారు.

నల్లగొండసమితిశాఖ :- 30-1-77న నల్లగొండ సమితి సమావేశం శ్రీ కె. శ్రీనివాసరెడ్డిగారి అధ్యక్షతన నల్లగొండలో జరిగింది. జిల్లాశాఖ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు శ్రీ పి కృష్ణమూర్తి, శ్రీ పి సత్యనారాయణగార్లు యుటియఫ్ కార్యక్రమాలను వివరించారు. శ్రీ కె అన్నపురెడ్డిగారు ఉపాధ్యాయులు వివిధ సమస్యలతో ఎలావేగిపోతున్నదీ వివరించి, వాటి పరిష్కారానికి సంఘటితశక్తే శరణ్యమని అన్నారు. పిదప శ్రీ యం. కృష్ణారెడ్డి అధ్యక్షులుగా, శ్రీ కె. రామచంద్రారెడ్డి, శ్రీ జి. వీరరాఘవయ్యగార్లు ఉపాధ్యక్షులుగా శ్రీ వి.విశనాథం ప్రధానకార్యదర్శిగా శ్రీ యం. శ్రీనివాస రెడ్డి, శ్రీ కె. అన్నపురెడ్డిగార్లు కార్యదర్శులుగా శ్రీ జానకిరాంరెడ్డి శ్రీ యన్. లక్ష్మయ్య, శ్రీమతి యన్‌వాణి కార్యవర్గ సభ్యులుగా సంఘ నూతన నిర్మాణం జరిగింది.

తెనాలి పట్టణ శాఖ:-తెనాలి పట్టణ యు. టి. యఫ్. శాఖ 1-2-77 న సమావేశమై పని గంటలు, బడిదినాలు 6, 7 తరగతులకు తగ్గిస్తూ జారీ చేయబడిన ఉత్తర్వు హైస్కూళ్లలో తికమకలకు దారి తీసిందని డి. యి. ఓ, గారి ప్రొసీడింగ్స్ ఇంకా గందరగోళంగా ఉన్నవని కాన ప్రస్తుతం జి. ఓ. 6, 7 తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు కూడా అన్వయించే ఖచ్చితమైన ప్రొసీడింగ్స్ ఇవ్వవలసిందిగా డి ఇ ఓ గార్ని కోరుతూ, ఆ పై తరగతులకుకూడా పనిగంటలు, బడిదినాలు తగ్గించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతూను తీర్మానించింది. మునిసిపల్ కమీషనర్ గార్ని సమన్వయ సమావేశం జరుప వలసిందిగాను, పి యఫ్ స్లిప్పులను ఇవ్వవలసిందిగాను కోరటమైనది.

భద్రాచలం సమితిశాఖ : భద్రాచలం సమితి శాఖ విస్తృత సమావేశం 30-1-77 న భద్రాచలంలో శ్రీ వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. సమితిశాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. మాల్యాద్రి సమర్పించిన ఉద్యమ రిపోర్టు చర్చానంతరం ఆమోదించబడింది. సమితి సమస్యలపై అధ్యక్షులు ప్రవేశపెట్టిన తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించి పై అధికారులకు పంపబడ్డాయి.

పొన్నమండ సెంటర్ : 22-1-77న తూ గో, జిల్లా పొన్నమండ సెంటర్ సమావేశం జరిగింది. నూతన సంవత్సరానికి కార్యదర్శిగా శ్రీ కె. రామం, సహాయ కార్యదర్శిగా పి. అబ్బులు ఎన్నికయ్యారు. ఇద్దరూ యు. టి యఫ్ సభ్యులే.

కృష్ణాజిల్లా శాఖ : 9-1-77 న యు.టి యఫ్. కృష్ణా జిల్లా శాఖ సబ్‌కమిటీ సమావేశం జిల్లా శాఖ అధ్యక్షులు శ్రీ జె. సత్యంగారి అధ్యక్షతన విజయవాడ రాష్ట్ర కార్యాలయములో

జరిగింది. జిల్లాశాఖ ప్రధానకార్యదర్శి శ్రీ యం. యేసురత్నం గారు జిల్లాశాఖ నిర్వహించిన కార్యక్రమాలను సమీక్షించారు. వివిధ బ్రాంచిలనుండి వచ్చిన కార్యకర్తలు రిపోర్టు యిచ్చారు. ఈ సమావేశమునకు రాష్ట్రనాయకులు శ్రీ ఎ వెంకటస్వామి (యు టి.యఫ్ ప్రధానకార్యదర్శి), శ్రీ యన్. శీతారామాచారి (యు టి.యఫ్ ఉపాధ్యక్షులు) హాజరై కౌన్సిల హైద్రాబాదు రాయభారం రిపోర్టులు యిచ్చారు. సభ్యత్వ క్యాంపైన్‌ను జయప్రదం చేయడానికి కార్యక్రమం తీసుకున్నారు.

ఉదయగిరి సమితి శాఖ:- 19-12-76 న నెల్లూరు జిల్లా ఉదయగిరి సమితిశాఖ సబ్‌కమిటీ సమావేశం జరిగింది. దానిలో నేటివరకు సభ్యత్వ, పత్రికా క్యాంపెయిన్‌లు సమీక్షించబడి జిల్లా ఇచ్చిన కోటా మేరకు 350 సభ్యత్వం 100 పత్రికలు పూర్తిచేయటానికి కార్యకర్తలు కార్యక్రమం తీసుకొన్నారు. అత్యవసర పరిస్థితి ఆధారంగా సమితి ఆఫీసులో ఇంక్రిమెంట్లు మంజూరు, సప్లిమెంటరీ బిల్లుల చెల్లింపు, సి. డి. మొదటి వాయిదా చెల్లింపు లంచగొండితనం మొదలగు సమస్యలు చర్చించి తగు కార్యక్రమం నిర్ణయించారు. కో ఆర్డినేషన్ మీటింగు జరపవలసిందిగా సమితిఅధికారుల్ని కోరారు. ఆ తేదీకి 120 సభ్యత్వం, 80 పత్రికలు పూర్తయ్యాయని కార్యకర్తలు రిపోర్టులిచ్చారు. జనవరిలోగా కోటా అధిగమించగలమని, వింజమూరు సమితికిగూడ ఉద్యమంవిస్తరింపజేయగలమని కార్యకర్తలకు ఆత్మవిశ్వాసం గలగటంతో తమ కృషిని తీవ్రతరం చేయడానికి నిర్ణయించుకొన్నారు.

## ఉపాధ్యాయునిపై దౌర్జన్యం, దుండగులకు జరిమానా

ఖమ్మంజిల్లా, వి. ఆర్. పురంసమితిలో ఉపాధ్యాయుడు శ్రీ యం. ముసలయ్యగారు ఎడ్యుకేషనల్ సెమినార్‌కు చింతూరు వెళ్ళి తిరిగి యింటికి వస్తున్న సమయంలో 17-1-76 తేదీన అల్లి కృష్ణార్జునరావు, అల్లి గాంధీ మొదలగువారు నల్గురు కలిసి అక్రమంగా కొట్టడం జరిగింది. దానిపై వెంటనే సమితి యు టి యఫ్ శాఖ పై అధికారుల దృష్టికి ఆ విషయం తెచ్చి విచారణ జరిపి దుండగులను శిక్షింపవలసిందిగా కోరింది. రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి కూడా పై అధికారులకు టెలిగ్రాం ఇచ్చారు. ఫలితంగా దుండగులు కష్టడికోటితీసుకోబడ్డారు. 23-11-76 న దుండగులకు రు. 30. లు చొప్పున జరిమానా విధిస్తూ భద్రాచలం సెకండుక్లాస్ మేజిస్ట్రేటు తీర్పు చెప్పారు.

## ఎల్. ఎఫ్. ఇన్‌స్పెక్టర్‌తో ఖమ్మంజిల్లా యూనిట్ చర్చలు

ఖమ్మం జిల్లాపరిషత్ అక్టోబరుమండి నేటివరకు తనలంభీ తంలోని పాఠశాలలకు ఎల్ ఎఫ్ వారినుండి గ్రాంటురాలేదనే సాకుతో, ఎ డి.ఏ చెల్లింపలేము, అలాగే కొత్తగూడెం, ఖమ్మం మధిర సమితులకు కూడా ఎ. డి. ఏ గ్రాంటు ఎల్. ఎఫ్ ఆఫీసు నుండి రిలీజ్ కాలేదు. ఆ విషయం పరిష్కరించటానికి జిల్లా యు. టి. యఫ్ శాఖ తరఫున శ్రీ వి. మల్లిఖార్జునరావు, శ్రీ ఆర్ పురుషోత్తంరావు గార్లు 18-1-77న ఎల్ ఎఫ్ ఇన్‌స్పెక్టర్ గార్ని కలిసి చర్చించగా యీ నెలలోనే పదరు గ్రాంట్లు రిలీజు చేస్తామని వారు వాగ్దానం చేశారు. అలాగే తిరుమలాయపాలెం, మధిర సమితులకు హెచ్ పి సి నిర్ణయం ప్రకారం పేస్కేల్సు,రివైజ్ కాబడిన ఎరియర్సు చెల్లింపవలసిన ఉపాధ్యాయులకు, ఇవ్వవలసిన మొత్తాలను కూడా గ్రాంటు రిలీజ్ చేయటానికి అంగీకరించారు.

పిఠాపురం,పెద్దాపురం మునిసిపాలిటీలలో ఉద్యమ విస్తరణ :- 23-1-77 నుండి 26-1-77 వరకు తూ గో జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ వి. సూర్యనారాయణ రాజు కార్యవర్గ సభ్యుడు శ్రీ జి. నాగేశ్వరరావు పిఠాపురంసమితిలో ముమ్మరంగా సభ్యత్వం. కాంపెయిన్ సాగించారు. పిఠాపురం పట్టణంలో ఉపాధ్యాయుల్ని సమీకరించి ఉద్యమావసరాన్ని ప్రబోధించి పట్టణశాఖను ఏర్పరచారు. అట్లే పెద్దాపురం టీచర్లను సమావేశపరిచి శ్రీ పి బి ముత్యాలరావు (జిల్లా సంఘ అధ్యక్షులు) శ్రీ వి సూర్యనారాయణరాజు, శ్రీ కె దేవీద్‌రాజు యుటియఫ్‌ను బలపరుచవలసిందిగా కోరేరు. ఉద్యమంలో భాగస్వాములు కావటానికి పట్టణ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు హామీ యిచ్చారు.

ఆ సందర్భంలో 26-1-77న పెద్దాపురం ఆర్ డి ఓ గారిని కలిసికొని వివిధ సమితులలోని సమస్యల్ని మెమొరాండంరూపంలో నివేదించారు, ఫలితంగా ఆర్ డి ఓ గారు త్వరలో బి డి ఓ లతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామని, సమస్యా పరిష్కారానికి కృషిచేస్తామని హామీయిచ్చారు ఆ రోజు పెద్దాపురం బి డి ఓ గారిని కలిసి టి ఎ సెంటర్లను పునరుద్ధరించాలని, అప్‌గ్రేడ్ అరియర్సు చెల్లించాలని, తని వారం కంటిన్యుయేషన్ చేయాలని మెమొరాండం ఇచ్చారు, బి డి ఓ గారు సావధానంగా విని పై విషయాలు పరిష్కరిస్తామన్నిహామీ ఇచ్చారు. ఆ రాయబారవర్గంలో సమితి అధ్యక్ష ప్రధానకార్యదర్శులు, శ్రీ సత్యనారాయణరాజు, శ్రీ యస్. యన్. రామ్‌కుమార్, శ్రీ కె. దేవిడ్‌రాజుగార్లు పాల్గొన్నారు.

## విస్సన్నపేటలో శ్రీచెన్నుపాటి స్మారకసభ

19-12-76న కృష్ణాజిల్లా, విస్సన్నపేటలో శ్రీ కె. భాస్కరరావు అధ్యక్షతన అమరజీవి శ్రీ చెన్నుపాటి స్మారకసభ జరిగింది. ఆ సభలో రాష్ట్రసంఘ ఉపాధ్యక్షులు శ్రీ యన్ సీతారామాచారి, జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ యం. ఏసురత్నం, సమితిశాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ జె సత్యం, సమితిశాఖ అధ్యక్షులు శ్రీ కె శౌరి, కార్యదర్శి శ్రీ బి జోసెను శ్రీ కె భాస్కరరావు అమరజీవి జీవితవిశేషాలు చెప్పి సభికుల్ని ఉత్తేజ పరిచారు.

## సవరణ

జనవరి 77సంచికలో 20పేజీలోని"భువనగిరి ప్రాంతీయసదస్సు" అనే శీర్షికక్రింద"జి రామచందర్, పి అంజనిరెడ్డి" అని ఉండాలి.

## శ్రద్ధాంజలి

ఖమ్మం పట్టణం, గుట్టల బజారు అప్పర్ ప్రైమరీ స్కూలులో పని చేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీ ఊటుకూరు సుబ్బారావుగారు గుండె పోటుతో జనవరి 29న మరణించారు. వారి మరణానికి యుటియఫ్ ఖమ్మం జిల్లాశాఖ తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించింది.

ఖమ్మం జిల్లా, మధిర ప్రభుత్వోన్నత పాఠశాల, ప్రధానోపాధ్యాయుడు శ్రీసి. హెచ్. లక్ష్మాద్రి 5-2-77 న అకాల మరణం పొందిరి. వారి మరణానికి జిల్లా యు.టిఎఫ్. శాఖ గాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది.

# ప్రభుత్వ ఉత్తర్వులు

( బాల్వాడీ టీచర్లకు సెకండరీ గ్రేడు స్కేలు )

GOVERNMENT OF ANDHRA PRADESH

From
Dr. Smt. A. Vanajakshi, M. A., M. Ed., Ph. D.,
Director of Woman and Child Welfare,
Andhra Pradesh,
Hyderabad.

To The President,
A. P. United Teachers Federation,
Akulavari St., Vijayawada-2.

Letter No. 3926/B2/76 dt. 29-12-76

Sir,

Sub :- Application of Secondary Grade Basic teacher scale to Balwadi teachers - Regarding.

Ref :- Your Lr. No. 372 dt. 17-12-76.

---

I am to inform you that, suitable clarifiications for application of Secondary Grade Basic teacher scale to Balwadi teacher, were issued to all the Officers concerned with the Balwadi institutions in this office Cir, Memo No. 3926/B2/76 dt 23-7-1976. A copy of the same is enclosed for your information.

Yours faithfully
(Sd) x x
For Director of Woman and Child Welfare.

Office of the Director of Woman and Child Welfare, Andhra Pradesh, Hyderabad.

Circular Memo No 3926/B2/76, Dated 23-7-1976.

Sub :- Balwadi teachers - Basic Secondary Grade Training candidates application of Secondary Grade Basic Teacher scale certain clarifications Issued.

Ref :- Govt Memo No. 1864/Prog. V/74, Dt. 3-5-74 from P. R. Dept.
2. L. Dis. No 695/A/76, Dt. 7-6-76 from the Dist. Woman and Child Welfare Officer, Kakinada.

---

All the Block Development Officers in the state are informed that the several balwadi teachers who are working in Panchayat Samithis are sending representations to this office for the application of Secondary Grade Basic Teachers scale as per the Government instructions in the memo first cited (copy enclosed) since they were trained as balasevikas by the Indian Council for Child Welfare. Government had issued instructions in the said memo that trained balasevikas are eligible for Secondary Grade Basic Teachers scale only after obtaining the orders of Government for relaxing the period of training.

To avoid hardship to the teachers Government may be addressed on relaxation of the period of training to the balasevikas so that they will be eligible for Secondary Grade Basic Teachers Scale. The appointing authority that is the Secretary, Z. P. concerned may send the proposals to Government for orders.

They are requested to acknowledge the receipt of this circular memo by return of the post.

(Sd). A. Krishna Kumari N. Kao,
For Director of Woman & Child Welfare.

GOVERNMENT OF ANDHRA PRADESH
Panchayat Raj Department.

Memo No. 1864/Prog. V/PR/74, Dt. 3-5-74.

Sub :- Establishment - Panchayat Samithi Bala Sevikas appointed either in Nursery sanction attached to Mahila Mandals or in Balwadi Scale of pay clarification issued.

Ref :- From the Director of Woman and Child Welfare Lr. No. 4053/D2/73, Dt. 5-6-73.

---

In her letter cited, the Director of Women and Child Welfare brought to the notice of the Government among other items that nursery section attached to Mahila Mandali a programme similar to balwadi and appointed out that the balasevikas training programme of the Indian Council for Child Welfare is mainly amount to provide workers to be incharge of pre-primary children and as such she has proposed that wherever Indian Council for Child Welfare Training balasevikas are appointed either in Nursery section attached to a Mahila Mandali or in a balawadi the scale of pay prescribed for such teacher in G. O No. 1413 Education dt. 3-6-66 should be applicable by *obtaining orders of Govt. relaxing the period of training* and that in case where higher grade trained teachers are appointed they should be paid the scale applicable to their grade in Education Dept asamended from time to time. Similarly in a Balawadi when a secondary grade trained teacher is appointed she should be paid the scale of pay applicable to her grade.

2. The Director of Woman and Child Welfare has requested that the suitable clarification may be issued to all the Block Development Officers so that they may follow the same and avoid hardship to the teacher.

The Government agreed with the above proposals of Director of Woman and Child Welfare and hereby direct that the Block Development Officers may follow the instructions in para 1 above.

(Sd). Swamy,
Deputy Secretary to Government.

( అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఏర్పాటు )

Copy of :

Government of Andhra Pradesh
Abstract

Andhra Pradesh Administrative Tribunal - procedure for dealing with notices received from the Tribunal on representatives or interim injunctions etc. - instructions - issued -

General Administration (SPF.B) Department

G. O. Ms. No. 768 Dated the 3rd November, 1976
the 12th Kartik, 1898, S. E.

Read :